



# 'కొండ'ంత వివాదం!

## ఇప్పటికే రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు

ఒకరి మెప్పుకోసం ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ధర్మారెడ్డి

ఐదేళ్లూ ఆయనపై విమర్శలు, ఆరోపణలు

అందరి దృష్టీ విచారణ పర్యవసానాలపైనే!

ప్రభుత్వం మారాక ఫిర్యాదుల వెల్లువ

ఒకరి మెప్పుకోసం ఆయన 'కొండ'ంత వివాదాస్పదుడిగా మారారు. టీటీడీలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఆయన నిర్ణయాలు, చర్యలు ఏ ఒక్కరి నుంచీ ప్రశంసలను పొందకపోగా అన్నివర్గాల విమర్శలకు, ఆరోపణలకు గురయ్యాయి. టీటీడీలో మూడు పర్యాయాలు కీలకంగా పనిచేసిన ఆయన ప్రతిసారీ వివాదాస్పద పరిస్థితుల్లో, అవమానకరంగా నిష్క్రమించారు. ఆ అధికారే టీటీడీ మాజీ ఈవో ఏవీ ధర్మారెడ్డి. కూటమి అధికారంలోకి వచ్చాక ఆయన నిర్ణయాలు, చర్యలపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. ఇందులో ఏవి వెలుగు చూస్తాయి? ఆయనపై ఎలాంటి చర్యలుంటాయన్న చర్చ అన్ని వర్గాల్లో నడుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కేంద్ర రక్షణ శాఖలో ఐడీఈఎస్ అధికారైన ఏవీ ధర్మారెడ్డి టీటీడీలో మూడుసార్లు డిప్యుటేషన్‌పై పనిచేశారు. ప్రతిసారీ ఆయన పనితీరు వివాదాస్పదమే. తొలిసారి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నపుడు ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసి 2004 జూలై 5న ధర్మారెడ్డిని టీటీడీలో తిరుమల జేఈవో పోస్టులో ఓఎస్డీగా నియమించారు. రెండేళ్లపాటు ఆ పోస్టులో ధర్మారెడ్డి కొనసాగారు. అప్పటి పాలకమండలి చైర్మన్‌గా నియమితులైన భూమన కరుణాకర్‌రెడ్డి కంటే ముందుగానే సభ్యురాలిగా టి.సుబ్బరామిరెడ్డి సతీమణి ఇందిరతో ప్రమాణస్వీకారం చేయించడం వివాదంగా మారింది. దీన్ని అవమానంగా భావించిన కరుణాకర్‌రెడ్డి.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వద్ద పట్టుబట్టి ధర్మారెడ్డిని బదిలీ చేయించారు. భూమన పదవీకాలం ముగిశాక 2008 ఏప్రిల్ 2న మరోసారి ధర్మారెడ్డి టీటీడీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. తిరుమల జేఈవో పోస్టులో ఓఎస్డీగా నియమితులై 28 నెలల పాటు పనిచేశారు. ఈయన వద్ద క్యాంపు క్లర్క్‌గా పనిచేస్తున్న సురేష్ ఆత్మహత్య చేసుకోవడంతో ధర్మారెడ్డి వేధింపులే కారణమని మృతుడి కుటుంబీకులు, ఉద్యోగ సంఘాలు అప్పట్లో ఆందోళనకు దిగాయి. దీంతో 2010 ఆగస్టు 31న ప్రభుత్వం మరోసారి ఆయనపై బదిలీ వేటు వేసింది. వైఎస్ జగన్ సీఎం కాగానే 2019 జూలై 12న మూడోసారి ధర్మారెడ్డి డిప్యుటేషన్‌పై టీటీడీలో స్పెషలాఫీసర్‌గా తిరుమల జేఈవో పోస్టులో నియమితులయ్యారు. ఈసారి ప్రభుత్వం ఆయన కోసం జేఈవో పోస్టును అదనపు ఈవోగా స్థాయి పెంచింది. 2022 నవంబరులో ఈవో జవహర్‌రెడ్డి బదిలీ కావడంతో ఈవో పోస్టును కూడా ధర్మారెడ్డికే కట్టబెట్టింది. దీంతో టీటీడీలో ఆయన సర్వాధికారిగా మారారు.

### ఇప్పుడూ అవమానకర నిష్క్రమణే

మూడోసారి నియమితులైన ధర్మారెడ్డి ఐదేళ్లపాటు టీటీడీలో ఎదురులేని వ్యక్తిగా అధికారం చెలాయించారు. అధికార పార్టీ నేతలనూ లెక్కచేయలేదు. ప్రభుత్వం మారడంతో సెలవు పెట్టి వెళ్లిపోయేందుకు యత్నించారు. ఆయనపై తీవ్ర ఆగ్రహంగా ఉన్న కొత్త ప్రభుత్వం సెలవు పెట్టడానికి అంగీకరించలేదు. సీఎం చంద్రబాబు తిరుమలకు వచ్చే క్రమంలో ధర్మారెడ్డి ముఖం చూడడం కూడా ఇష్టపడక పోవడంతో అప్పటికప్పుడు వారం పాటు సెలవుపై పంపించింది ప్రభుత్వం. తర్వాత ఆయనే సెలవు పొడిగించుకుని గత నెలాఖరున సెలవులో ఉండగానే సర్వీసు నుంచి రిటైరయ్యారు. కనీసం అధికారికంగా టీటీడీ యంత్రాంగం వీడ్కోలు పలికే పరిస్థితి కూడా లేదు. గతంలో రెండుసార్లు అవమానకర రీతిలో బదిలీ అయిన ఆయన.. మూడోసారి మాత్రం అనామకంగా, అవమానకరంగా కొండ దిగాల్సి వచ్చింది.

### ఐదేళ్లూ ఆరోపణలు.. ఇపుడు ఫిర్యాదులు

టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చిన ధర్మారెడ్డి తీరుపై వైసీపీ మినహా మిగిలిన అన్ని రాజకీయ పార్టీల నేతలూ మండిపడ్డాయి. ప్రతిపక్ష నేత హోదాలో టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ జిల్లాలోనూ, వెలుపలా కూడా అనేక సందర్భాల్లో ధర్మారెడ్డి తీరుపై నిప్పులు చెరిగారు. అప్పటి టీటీడీ వ్యవహారాలపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి సంబంధించి కేంద్ర మంత్రులూ ధర్మారెడ్డి తీరుపై ఫిర్యాదులు చేశారు. స్థానిక నేతలైతే ఆందోళనలకు దిగిన సందర్భాలూ ఉన్నాయి. అనేక అంశాలపై కోర్టుల్లోనూ పోరాడారు. చివరికి కమ్యూనిస్టు నేత నారాయణ వంటి వారూ ధర్మారెడ్డి నిర్ణయాలను ఆక్షేపించినవారే. కూటమి అధికారంలోకి రావడంతో ఇప్పుడు నేరుగా ప్రభుత్వానికే ఫిర్యాదులు చేస్తున్నారు. కొందరు సీఎం చంద్రబాబుకు, మరికొందరు సీఎస్‌కు, ఇంకొందరు డీజీపీకి, సీఐడీ చీఫ్‌కు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి, ఏసీబీకి సైతం ఫిర్యాదులు చేస్తున్నారు. ఒకరిద్దరు తమ ఫిర్యాదులకు ఆధారాలూ జతచేశారు.

### ధర్మారెడ్డి హయాంలో మసకబారిన టీటీడీ ప్రతిష్ఠ

టీటీడీ చరిత్రలో ఏ అధికారీ చేయని రీతిలో ధర్మారెడ్డి అధికారం చెలాయించారు. నిరంకుశుడనే పేరు తెచ్చుకున్నారు. అప్పట్లో సీఎం జగన్‌కు సన్నిహితుడనే కారణంగా అధికార పార్టీలోనూ అతికొద్ది మంది ముఖ్య నేతలను మినహా మిగిలిన వారిని ఖాతరు చేయలేదు. మంత్రులు సైతం ఆయన నుంచి అవమానాలు ఎదుర్కొన్నవారే. దర్శనాల విషయంలోనూ అతి కొద్దిమందికే పెద్దపీట వేశారు. జగన్‌పై ఉన్న అక్రమాస్తుల కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను, న్యాయమూర్తులను ప్రభావితం చేసేందుకు టీటీడీని, శ్రీవారి దర్శనాలను దుర్వినియోగం చేశారన్నది ఆయనపై ఉన్న ప్రధాన ఆరోపణ. ఓ హైకోర్టు న్యాయమూర్తికి ఖరీదైన వాచీ ఇవ్వజూపారని, మరెందరో న్యాయమూర్తులు తమకు తామే ఎబ్బెట్టుగా భావించేలా తిరుమలలో అతి మర్యాదలు చేయబోయారన్న ఆరోపణలూ ఉన్నాయి. మరోవైపు వైసీపీ ముఖ్యులకు, పాలకమండలి ముఖ్యులకు లబ్ధి కలిగించేలా నిధుల కేటాయింపులు జరిపి ఆర్థిక పరమైన తప్పిదాలకు పాల్పడ్డారనే ఆరోపణలు టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. దర్శన టికెట్ల కేటాయింపు, శ్రీవాణి ట్రస్టుద్వారా విరాళాల మళ్లింపు, ఇంజనీరింగ్ పనులకు అవసరం లేకున్నా రూ.వేల కోట్ల కేటాయింపు వంటివి ఆయనపై ఉన్న ఇతర ఆరోపణలు. వీటికితోడు మితిమీరిన అహంకారం, వ్యక్తిగత ప్రతిష్ఠకు పోవడం, ఎదుటి వారిని ఇబ్బంది పెట్టేలా కఠినంగా వ్యవహరించే నైజమని ఆయన్ను దగ్గర్నుంచి గమనించిన టీటీడీ వర్గాలు చెబుతుంటాయి.

### విచారణ కొనసాగిస్తున్న విజిలెన్స్

టీటీడీ వ్యవహారాలపై ఇప్పటికే ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ విభాగం అధికారులు బృందాలుగా ఏర్పడి ఆయా విభాగాల్లో తనిఖీలు, విచారణలు కొనసాగిస్తున్నారు. వెలుపల అవగాహన కలిగిన వ్యక్తులను కలిసి సమాచారం సేకరిస్తున్నారు. వీటిని క్రోడీకరించుకునే పని వేగంగా జరుగుతోంది. సాధ్యమైనంత త్వరలో ధర్మారెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దానికి అవసరమైన ఆధారాల కోసం విజిలెన్స్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. విజిలెన్స్ దర్యాప్తులో తేలే అంశాలు.. వాటి ఆధారంగా ధర్మారెడ్డిపై తీసుకునే చర్యలపైనే ఇప్పుడు రాజకీయ, టీటీడీ వర్గాలతోపాటు సామాన్య జనం దృష్టి కూడా ఉంది. ధర్మారెడ్డికి వైసీపీ అధినేత జగన్ వద్ద ఉన్న అపరిమిత పలుకుబడి కారణంగా ఇప్పుడు ఆయన్ను ఇబ్బంది పెడితే భవిష్యత్తులో తమకూ సమస్యలు ఎదురవుతాయన్న ఆందోళన విజిలెన్స్ అధికారుల్లో నెలకొన్నదని, అందుకే విచారణను సాగదీస్తున్నారనే ప్రచారం ఇప్పటికే మొదలైంది. అయితే టీటీడీ నిర్వహణలో జరిగిన ఆర్థిక తప్పిదాలను గుర్తించి.. ధర్మారెడ్డి తదితరులపై చట్టబద్ధమైన చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం ఉందన్న ప్రచారం మరోవైపు సాగుతోంది. నిజంగానే ప్రభుత్వం ధర్మారెడ్డిపై కఠిన వైఖరి తీసుకుంటుందా లేక తప్పిదాలను ఎత్తిచూపడం వరకే పరిమితం అవుతుందా అన్నది వివిధ వర్గాలను, ప్రజల్ని ఉత్కంఠకు గురి చేస్తోంది. ఇందులో ఏదైనా నెల రోజుల్లోపే జరుగుతుందని అధికార వర్గాల సమాచారం.

## ఎస్పీగా సుబ్బరాయుడు నేడు బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం), జూలై 14: జిల్లా ఎస్పీగా ఎల్.సుబ్బరాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే టీటీడీ ఇన్‌చార్జి సీవీఎస్వోగా ఆయన్ను నియమించే అవకాశాలున్నట్టు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

## విద్యుత్ బస్సుల చార్జింగ్ స్టేషన్‌కు తిరుమలలో స్థలం ఎంపిక

- పరిశీలించి, సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ ఎండీ
- టీటీడీకి ప్రతిపాదనలు పంపాలని ఆదేశం



బాలాజీనగర్ వద్ద శనివారం సాయంత్రం స్థలాన్ని పరిశీలిస్తున్న ద్వారకా తిరుమలరావు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 14: తిరుమల-తిరుపతి మధ్య పూర్తిస్థాయిలో విద్యుత్ (ఎలక్ట్రిక్) బస్సులు నడపాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరే దిశగా అడుగులు పడుతున్నాయి. రెండేళ్ల కిందట జిల్లాకు తొలివిడతగా వంద విద్యుత్ బస్సులు వచ్చాయి. అందులో 62 బస్సులు.. తిరుమల-తిరుపతి, రేణిగుంట మధ్య, మిగిలినవి తిరుపతి కేంద్రంగా కడప, మదనపల్లె, నెల్లూరు, శ్రీకాళహస్తిలకు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటికోసం అలిపిరి డిపో, సీబీఎస్‌లో చార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. అయితే పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమల - తిరుపతి మధ్య సుమారు 250 బస్సులు నడపాలన్నది ఇటు ప్రభుత్వం, అటు టీటీడీ లక్ష్యంగా ఉంది. ఇన్ని బస్సులు నడపాలంటే ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్ (వంద బస్సులు ఒకేసారి చార్జింగ్ చేసుకునేలా)ను ఏర్పాటు చేయాలని భావించారు. దీన్ని తిరుమలలో ప్రస్తుతమున్న బస్టాండు, గ్యారేజీలో ఏర్పాటుకు వీలుపడదని నిపుణుల ద్వారా ఆర్టీసీ అధికారులు నిర్ధారించుకున్నారు. ఆ తర్వాత టీటీడీని సంప్రదించి స్థలం కేటాయించాలని కోరారు. కొన్ని ప్రాంతాలను పరిశీలించి.. బాలాజీనగర్‌కు వెళ్లేమార్గంలో గ్యాస్ గోడౌన్ వద్ద నాలుగు ఎకరాల స్థలాన్ని ఎంపిక చేసుకున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు డీజీపీ హోదాలో తొలిసారిగా తిరుమల పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా ఏడాదిన్నరగా వాయిదా పడుతున్న ఈ అంశం ఓ కొలిక్కివచ్చింది. శనివారం సాయంత్రం బాలాజీనగర్ వద్ద స్థలాన్ని ఆయన పరిశీలించారు. చార్జింగ్ స్టేషన్‌కు అనుకూల, ప్రతికూల అంశాలపై డీపీటీవో చెంగల్‌రెడ్డి, డీఎం విశ్వనాథం, ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. స్థల ఎంపికపై ఎండీ సానుకూలంగా స్పందించారు. ఆలస్యం చేయకుండా ఆర్టీసీ తరఫున టీటీడీకి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. కాగా, తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ బస్సు టర్మినల్ నిర్మాణ సమయంలో ఇక్కడి డిపోను చంద్రగిరికి తరలించే యోచనలో ఉన్నామని అధికారులు తెలిపారు. అందువల్ల చంద్రగిరి బస్టాండు విస్తరణకు అవసరమైన ప్రతిపాదనలకు కూడా ఎండీ అంగీకరించినట్లు తెలిసింది.

# విషాదం

- ఆటో కోసం నిరీక్షిస్తుండగా తల్లీ బిడ్డలపైకి దూసుకొచ్చిన లారీ
- తల్లి, రెండేళ్ల కుమార్తె దుర్మరణం
- కుమారుడి పరిస్థితి విషమం



ప్రమాదానికి కారణమైన లారీ



వైష్ణవి, శారద (ఫైల్ ఫొటోలు)

ఏర్పేడు, జూలై 14: రోడ్డు పక్కన ఆటో కోసం నిరీక్షిస్తున్న తల్లీబిడ్డలపైకి ఓ లారీ దూసుకొచ్చింది. ఈ దుర్ఘటనలో తల్లి, రెండేళ్ల కుమార్తె దుర్మరణం చెందారు. కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషాద సంఘటన ఏర్పేడు మండలం అముడూరు క్రాస్ వద్ద ఆదివారం రాత్రి ఏడు గంటలకు జరిగింది. ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాళహస్తి మండలం రామానుజపల్లె గ్రామానికి చెందిన బాపన శివకుమార్ భార్య శారద(22) తన కుమారుడు కార్తీక్(4), కుమార్తె వైష్ణవి(2)ని తీసుకుని ఈనెల 13వ తేదీన తన పుట్టిల్లు అయిన రేణిగుంట మండలం మల్లవరానికి వెళ్లింది. తిరిగి ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు రామానుజపల్లె వెళ్లడానికి ఇద్దరు బిడ్డలతోపాటు తల్లి విజయమ్మ(50)ను తీసుకుని వెంకటగిరి బస్సు ఎక్కింది. 6.45గంటల సమయంలో అముడూరు క్రాస్ వద్ద బస్సు నుంచి దిగారు. అక్కడినుంచి రామానుజపల్లెకి వెళ్లడానికి ఆటో కోసం నలుగురూ రోడ్డు పక్కన నిరీక్షిస్తున్నారు. ఇంతలో మృత్యుశకటంలా ఓ లారీ వీరిపైకి దూసుకొచ్చింది. ఈ దుర్ఘటనలో శారద అక్కడికక్కడే మృతి చెందారు. ఆస్పత్రికి తరలిస్తుండగా వైష్ణవి మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ కార్తీక్‌ని టోల్‌ప్లాజా అంబులెన్సులో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, వైద్యుల సూచనలతో రేణిగుంట మండలంలోని అమరా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, ఈ ప్రమాదంలో శారద తల్లి విజయమ్మకు ఎలాంటి గాయాలు కాలేదు. ఏర్పేడు సీఐ కేసు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వీడ్కోలు

రేణిగుంట, జూలై 14: తిరుమల పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు ఆదివారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయంలో కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, టీటీడీ జేఈవో గౌతమి, నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ వీడ్కోలు పలికారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ దంపతులు వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేశారు.



సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు శ్రీవారి ప్రతిమ అందజేస్తున్న కలెక్టర్ దంపతులు

## ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 14: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 33వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,808 మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 4,298 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 3,243 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,344, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 376మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 289మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 72మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,378 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

### బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

ఏర్పేడు, జూలై 14: ఆరేళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన వృద్ధుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఏర్పేడు మండలంలో వారం కిందట జరిగిన ఈ సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూడటంతో ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం నిందితుడైన బలరామయ్యగౌడ్ (61)ను సీఐ శ్రీరామ శ్రీనివాసులు అరెస్టు చేశారు. సోమవారం ఉదయం 11గంటలకు రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

## గ్రామాల్లో పడకేసిన పాలన

- 774 పంచాయతీలకు రెగ్యులర్ కార్యదర్శులు 351 మంది

తిరుపతి(కలెక్టరేట్), జూలై 14: వైసీపీ పాలనలో పంచాయతీలను నిర్వీర్యం చేసిన విషయం తెలిసిందే. మరోవైపు అప్పటి ఎమ్మెల్యేలు సైతం ఎంపీడీవోలను అడ్డుపెట్టుకుని ఇన్‌చార్జి కార్యదర్శులుగా నాలుగైదు పంచాయతీలకు ఒకరినే నియమించుకుని పాలనను పడకేసేలా చేశారన్న విమర్శలున్నాయి. జిల్లాలో 774 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 351 పంచాయతీల్లో మాత్రమే రెగ్యులర్ కార్యదర్శులు పనిచేస్తున్నారు. 260 పంచాయతీల్లో సచివాలయాల్లోని గ్రేడ్-5 కార్యదర్శులను నియమించి అప్పటి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. దీని కారణంగా గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహణ సక్రమంగా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆస్పత్రి పాలవుతున్న జనం**

చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, సత్యవేడు నియోజకవర్గాల్లో అప్పటి వైసీపీ ఎమ్మెల్యేల ఆదేశాలతో ఎంపీడీవోలు తమకు అధికారం లేకపోయినా మేజర్ పంచాయతీల్లో కార్యదర్శులను తొలగించి.. మూడు, నాలుగు పంచాయతీలకు ఓ కార్యదర్శినే డిప్యుటేషన్‌పై నియమించారు. దీనివల్ల సుమారు 400పైగా పంచాయతీల్లో పరిపాలన అస్తవ్యస్తంగా తయారైంది. మౌలిక వసతులు కరువై.. సీజనల్ వ్యాధులతో జనం ఆస్పత్రి పాలవుతున్నారు. ఇప్పటికైనా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ కార్యదర్శులను నియమించి.. పంచాయతీ పాలనను గాడిలో పెట్టాలని జనం కోరుతున్నారు.

### కోటలో అత్యధిక వర్షపాతం

- 57.2 మి.మీ. నమోదు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 14: జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. కోట మండలంలో అత్యధికంగా 57.2మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. దొరవారిసత్రంలో 51.2, చిట్టమూరులో 46.2, నాయుడుపేటలో 35.8, తిరుపతి అర్బన్‌లో 26.6, వడమాలపేటలో 26.4, సూళ్లూరుపేటలో 21.4, తడలో 18.8, చిల్లకూరులో 18.4, పెళ్లకూరులో 18, గూడూరులో 17.6, తొట్టంబేడులో 17.2, ఓజిలిలో 16.4, బుచ్చినాయుడుకండ్రిగలో 16.2మి.మీ.వర్షం కురిసింది. ఆదివారం కూడా చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. కూరగాయల పంటకు పాక్షికంగా నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు

తిరుమల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి, ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 75,916 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 42,920 మంది తలనీలాలు సమర్పించారు.

## అమ్మవారి సేవలో ప్రముఖులు

● డీజీపీకి సాదర స్వాగతం





అమ్మవారి ఆలయం వద్ద డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులు - తన శిష్య బృందంతో వేదవర్ధన తీర్థస్వామి

తిరుచానూరు, జూలై 14: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు సాంప్రదాయబద్ధంగా ఆయనకు స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి తరువాత అమ్మవారి మూలమూర్తిని ద్వారకా తిరుమలరావు దంపతులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి, అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు అనంతపురం రేంజీ డీఐజీ షెముషి బాజ్‌పాయ్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధనరాజు, టీటీడీ ముఖ్య నిఘా భద్రతా అధికారి నరసింహ కిషోర్ దర్శించుకున్నవారిలో ఉన్నారు. ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కర్ణాటక రాష్ట్రం ఉడిపిలోని షిరూర్ మఠాధిపతి వేదవర్ధన్ తీర్థస్వామి తన శిష్యబృందంతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

## డీజీపీకి శుభాకాంక్షలు



డీజీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, జూలై 14: తిరుపతి పర్యటనకు విచ్చేసిన డీజీపీ ద్వారకా తిరుమలరావును తిరుపతిలో ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని టీడీపీ నేతలతో మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## వెంకన్న సేవలో ప్రముఖులు



రషీద్

తిరుమల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీ లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, విశ్వేశ్వరరాజు, నరేంద్రవర్మ, వరపుల సత్యప్రభ, మాధవిరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, అండర్-19 క్రికెటర్ షేక్ రషీద్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

## ఆ ఐఏఎస్‌లను దూరం పెట్టండి

- వైసీపీకి అంటకాగి, అడ్డగోలుగా దోచేశారు
- సీఎం, డిప్యూటీ సీఎంలకు రాష్ట్ర ఉద్యోగుల సంఘ మాజీ నేత నరసింహ నాయుడు లేఖ

తిరుపతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో పనిచేసిన కొంతమంది ఐఏఎస్ అధికారులు వైసీపీ నేతలకు ఊడిగం చేశారు.. అవినీతికి పాల్పడి అడ్డగోలుగా దోచేశారు.. అలాంటి వారిని దూరం పెట్టాలంటూ సీఎం చంద్రబాబు నాయుడికి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు రాష్ట్ర ఉద్యోగుల సంఘ మాజీ నేత, జనసేన నాయకుడు నరసింహ నాయుడు లేఖ రాశారు. 'కలెక్టర్లుగా పనిచేసిన ప్రద్యుమ్న, సిద్ధార్థ జైన్, జేసీగా పనిచేసిన గిరీష, తిరుపతి సబ్ కలెక్టర్లుగా పనిచేసిన నిశాంత్, మహేష్ కుమార్‌లు అప్పటి వైసీపీ నేతలతో కలిసి అనేక అవకతవకలకు పాల్పడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి వేధించారు. 2019 ఎన్నికల్లో తిరుపతి ఎమ్మెల్యే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో ప్రద్యుమ్న హస్తముంది. ఈయన భార్య వైసీపీ లీగల్ సెల్‌లో ఉన్నారు. మరో కలెక్టర్ హరినారాయణ పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు పూర్తిసహాయ సహకారాలు అందజేశారు. జేసీగా ఉన్న గిరీష తిరుపతి విమానాశ్రయం వద్ద కర్ణాటకకు చెందిన తనవారికి 18 ఎకరాల భూమిని మెడికల్ కాలేజ్ నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారు. తిరుపతిలో ఎపిక్ కార్డుల కుంభకోణంలోనూ ఇరుక్కున్నారు. అప్పట్లో చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సిద్ధార్థ జైన్ అరాచకాలకు అంతేలేదు' అని లేఖలో నరసింహ నాయుడు పేర్కొన్నారు.

# నష్టాల బాటలో చేయూత మహిళా మార్ట్...?

చంద్రగిరి, జూలై 14: చంద్రగిరిలో మహిళా స్వయం సహాయక సభ్యుల పెట్టుబడితో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్ నష్టాల బాటలో నడుస్తోంది. నెల రోజులకు పైగా మార్ట్ మూసివేయడంతో ఇక శాశ్వతంగా మూతపడబోతున్నట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలో మండలంలోని 1288 మహిళా స్వయం సహాయక సంఘాల్లోని 11 వేల మంది భాగస్వామ్యంతో ఒక్కొక్కరి వద్ద రూ.300 చొప్పున రూ.33 లక్షలు వసూలుచేసి, 2022, డిసెంబరు 14న అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేతుల మీదుగా వైఎస్‌ఆర్ చేయూత మహిళా మార్ట్ (సూపర్ మార్కెట్)ను ప్రారంభించారు. పొదుపు సంఘాల సభ్యులను ప్రోత్సహించడానికి తనవంతుగా సెర్ప్ చేయూతనిచ్చింది. ఈ మార్ట్‌లో మండలంలోని ప్రతి మహిళా సభ్యురాలు ఖచ్చితంగా నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాలని అధికారులు ఆదేశించారు. నాణ్యమైన సరుకులను ఇతర మార్కెట్లో ఇచ్చే ధరల కంటే మహిళా మార్ట్‌లో తక్కువకు ఇస్తామన్నారు. దీంతో అప్పట్లో మార్ట్‌లో రోజుకు రూ.లక్ష వరకు వ్యాపారం జరిగేది. కాలక్రమేణా మహిళా సభ్యులు మార్ట్‌కు రావడానికి విముఖత చూపడంతో రోజు రోజుకు నష్టాల బాటలో నడుస్తుంది. మార్ట్‌ను అద్దె భవనంలో నిర్వహించడం, విద్యుత్ ఛార్జీలు, పనిచేసే సిబ్బంది వేతనాలు తదితర ఖర్చులు నెలకు రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు అవుతున్నాయి. మార్ట్‌ను మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల సమయంలో పొదుపు సంఘాల సభ్యులు మార్ట్‌లోనే సరుకులు కొనుగోలు చేయాలనే నిబంధన పెట్టవద్దని అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మహిళా సభ్యులు రావడం తగ్గిపోయింది. డీమార్ట్, బిగ్ బజార్, రిలయన్స్ మార్ట్‌లలో ఇస్తున్న రాయితీలు మహిళా మార్ట్‌లో ఇవ్వకపోవడం కూడా ఒక కారణం. దీంతో నెల రోజులకుపైగా చంద్రగిరిలో చేయూత మహిళా మార్ట్‌ను మూసివేశారు. నష్టాల బాటలో ఉన్నందున త్వరలోనే ఈ మార్ట్‌ను మూసివేయనున్నట్లు సమాచారం.



చంద్రగిరిలో మూసివేసిన చేయూత మహిళా మార్ట్

## చంద్రగిరిని అభివృద్ధి బాటలో నడిపిస్తా

ఎమ్మెల్యే పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, జూలై 14: చంద్రగిరిని అభివృద్ధి బాటలో నడిపిస్తానని, అందుకు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తనకు సహకరించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. ఆదివారం చంద్రగిరిలో మాజీ సైనికులు, ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను గెలిచిన వారం రోజుల్లోనే చంద్రగిరిలో అస్తవ్యస్తంగా ఉన్న రహదారుల పనులు ప్రారంభించి, పూర్తి చేసినట్లు చెప్పారు. గోవిందధామము ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి, శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. చంద్రగిరి పట్టణం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. జాతీయ రహదారి నుంచి శ్రీనివాస మంగాపురం వరకు 80 నుంచి 100 అడుగుల రోడ్డు విస్తరణచేయాలని, తిరుమల శ్రీవారి దర్శనానికి సుదూర ప్రాంతాలనుంచి కాలినడకన వచ్చే భక్తుల కోసం విశ్రాంతి షెడ్డు ఏర్పాటు చేయాలని ఇప్పటికే టీటీడీ అధికారులతో చర్చించినట్లు పేర్కొన్నారు. అనంతరం మాజీ సైనికులు, విశ్రాంత ఉద్యోగులు ఎమ్మెల్యే నానీని ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

చంద్రగిరి, జూలై 14: చంద్రగిరిలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు విరాళాలు అందజేశారు. ఆదివారం ఆలయ తలుపుల తయారీకి తమిళనాడు రాష్ట్రం, సేలంకు చెందిన వీఆర్కె. గోపీనాథ్, కుటుంబ సభ్యులు రూ.4,10,000, చంద్రగిరి మండలం, అగరాల గ్రామానికి చెందిన చెందిన పాలపాటి చైతన్య రూ.1,01,116, తిరుపతి రూరల్ మండలం, కాలూరుకు చెందిన సరళ రూ.10,116 విరాళంగా అందచేశారు. ఆదివారం ఒక్కరోజే మొత్తం రూ.5,21,232 విరాళంగా వచ్చింది. ఈ నగదును ఆలయ ఈవో పుట్టా రామకృష్ణారెడ్డికి అందజేశారు. ఈసందర్భంగా దాతలను ఆలయ అధికారులు సత్కరించారు. టీడీపీ నాయకుడు, మాజీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న దాతలు

## భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు



పాకాల, జూలై 14: స్థానిక పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లను ఆదివారం భక్తిశ్రద్ధలతో పురవీధుల్లో ఊరేగించారు.ప్రత్యేక వాయి ద్యాలతో పుష్పాలతో అలంకరించిన పీర్లను ఊరేగించారు. పదిరోజుల పాటు నిర్వహించే పీర్ల పండుగలో సోమవారం, మంగళవారం అగ్నిగుండం నిర్వహించనున్నారు. బుధవారం వరకు వేడుకలు జరుగనున్నాయి. పీర్ల చావిడిలో కొలువైన పీర్ల వద్ద హిందూ ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీర్ల చావిడి పరిసరాల్లో ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ చేశారు.

## బోయకొండకు వస్తూ ... వాహనం బోల్తా

● ఏడుగురికి తీవ్ర గాయాలు

చౌడేపల్లె, జూలై14: బోయకొండ గంగమ్మ దర్శనం కోసం వస్తూ బొలోరా వాహనం బోల్తా పడటంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం చౌడేపల్లె మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ తాలూకా పుగనపల్లె, కొడిగిపల్లె, హన్కూర్ గ్రామాలకు చెందిన వెంకట్రాప్ప కుటింబసభ్యులు తమ బంధు మిత్రులతో కలసి బోయకొండ గంగమ్మ దర్శనం కోసం బొలోరా వాహనంలో బయలుదేరివచ్చారు. ఈక్రమంలో మండలంలోని కర్ణంవారిపల్లె సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో వెంకట్రా మయ్య(60), సుగుణమ్మ(35), సుబ్బరత్న (55), కృష్ణమ్మ(45) సుమ(29), నారాయణమ్మ(40), సుశీలమ్మ(45) తీవ్రంగా గాయపడ్డారు. మరి కొందరు స్వల్పంగా గాయపడ్డారు. పుంగనూరు, చౌడేపల్లె నుంచి రెండు 108 వాహ నాలు రాగా ఈఎంటీ గణేష్ వారికి ప్రథమ చికిత్సలు చేశారు. మెరుగైన చికిత్సల కోసం పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.



గాయపడ్డ వెంకట్రాయప్ప, సుబ్బరత్నమ్మ, కృష్ణమ్మ

## పోటెత్తిన భక్తజనం

బోయకొండ గంగమ్మను దర్శించుకున్న 40 వేల మంది

చౌడేపల్లె, జూలై 14: బోయకొండకు ఆదివారం భక్తులు పోటెత్తారు. గంగమ్మ దర్శనానికి బారులు తీరారు. అమ్మవారికి ప్రీతికరమైన ఆషాడ మాసం రెండో ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి దర్శనానికి 2 గంటలపాటు క్యూలో వేచి ఉండాల్సి వచ్చింది. ఉదయం 5 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రద్దీ కొనసాగింది. దాదాపు 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఒక్కరోజే బోయకొండ గంగమ్మకు రూ.19 లక్షల ఆదాయం సమకూరింది. కొండపై నుంచి కింద వరకు రెండు కిలోమీటర్ల పొడవునా కార్లు నిలిచిపోవటంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేకాలంకారంలో గంగమ్మ

## వరసిద్ధుడి గో సంరక్షణ ట్రస్టుకు విరాళం



చెక్కు అందిస్తున్న సుబ్రహ్మణ్యంరెడ్డి

ఐరాల(కాణిపాకం), జూలై 14: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని గో సంరక్షణ ట్రస్టుకు ఆదివారం తిరుపతికి చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి రూ.1.85లక్షలు విరాళంగా అందించారు. నెల్లూరుకు చెందిన పవన్‌శ్రీనివాస్ గో సంరక్షణ ట్రస్టుకు రూ.50,011, అన్నదానానికి రూ.50,011 విరాళంగా అందించారు. ఈ మేరకు చెక్కులను ఆలయాధికారులకు అందించారు. దాతలకు ఏఈవో హరిమాధవరెడ్డి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా సంకట వజ్ర వారాహి హోమం



సంకట వజ్ర వారాహి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

రామచంద్రాపురం, జూలై 14: రాయలచెరువుకట్ట భవనా జలకంఠేశ్వరాలయం వద్ద ఆదివారం రాత్రి సంకట వజ్ర వారాహి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు విశేషంగా పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయ యజ్ఞశాలలో వేదపండితులు సంకట వ్రజ వారాహి హోమం నిర్వహించి, పూర్ణాహుతితో ముగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉభయకర్తలు ప్రీతి, మురళీకృష్ణ దంపతులు పాల్గొన్నారు.

## 18న చంద్రగిరి సీహెచ్‌సీలో ఎంఎల్సీ, పోస్టుమార్టం ప్రారంభం



సిద్ధం చేసిన పోస్టుమార్టం గది

చంద్రగిరి, జూలై 14: చంద్రగిరిలో సామాజిక ఆరోగ్య కేంద్రం లో ఈనెల 18వ తేది నుంచి పోస్టు మార్టం, ఎంఎల్సీ (మెడికో లీగల్ సర్టిఫికెట్) జారీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎంఎల్సీ పోస్టుమార్టం నిర్వహించడానికి వైద్య శాఖ కమిషనర్ నుంచి అనుమతులు వచ్చాయి. 18వ తేది నుంచి చంద్రగిరి ఆస్పత్రిలోనే ఎంఎల్సీలను జారీ చేయనున్నారు. అదేవిధంగా మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడానికి కూడా తగిన ఏర్పాట్లు చేశారు.

## టీడీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే నివాళి



నారా చిన్నబ్బ నాయుడి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, జూలై 14: చంద్రగిరి మండ లం, నారావారిపల్లెలోని టీడీపీ నాయకుడు నారా చిన్నబ్బ నాయుడు మృతికి ఎమ్మెల్యే పులివర్తి నాని ఘనంగా నివాళులు అర్పించారు. నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు బంధువైన చిన్నబ్బ నాయుడు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 8న మృతి చెందారు. ఆదివారం నారావారిపల్లెలో నిర్వహించిన కర్మక్రియల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని చిన్నబ్బ నాయుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, నేతలు పాల్గొన్నారు.

---

**శివుడి ఆజ్ఞ లేనిదే చీమయినా కుట్టదంటారు. కానీ కుప్పం రెస్కోలో మాత్రం అవినీతిమయమైన ఆజ్ఞలు ఇచ్చేది ఎవరైనా 'కృష్ణ'మాయ లేనిదే ఫైల్ పుటప్ కాదు. ఆయన ఫైల్ తయారు చేశారంటే ఎవరూ తప్పు పట్టలేనంతగా పకడ్బందీగా ఉంటుందంటారు. ఇక్కడి అక్రమాలన్నీ సీనియర్ అసిస్టెంట్ హోదాలోని ఆ ఉద్యోగి చేసిన ఫైళ్ల మాయల ద్వారానే జరిగాయి. ఎన్ని విచారణలు జరుగుతున్నా ఆయనను కనీసం తాకలేకపోవడం 'కృష్ణ'మాయాజాలం మహత్తుకు తార్కాణం.**

\- కుప్పం

# రెస్కోలో కృష్ణ మాయ!



కుప్పం రెస్కో కార్యాలయం

- కీలక పోస్టులో సర్వంసహాధికారాలు
- అక్రమ పదోన్నతులు, నియామకాలు ఆయన చలవే
- మాజీ, ప్రస్తుత ఎండీల డైరెక్షన్‌లో చెలరేగిపోయిన విధానం

కుప్పం రెస్కో (రూరల్ ఎలక్ట్రికల్ కో ఆపరేటివ్ సొసైటీ)లో వైసీపీ హయాంలో అక్రమ నియామకాలు, అడ్డగోలు పదోన్నతులు.. ఇలా ఎన్నో అవినీతి చర్యలు చోటుచేసుకున్నాయి. వీటిలో కొన్ని ప్రాథమిక విచారణలో నిర్ధారణ కూడా అయ్యాయి. ఈ అక్రమాలు జరగాలంటే దానికి అనుగుణంగా ఫైళ్లు తయారు కావాలి. పదోన్నతులు, నియామకాలు ఏ బేస్ మీద చేస్తున్నారో, కో ఆపరేటివ్ సెక్టార్ నిబంధనలు అంగీకరిస్తున్నాయో లేదో ఆ ఫైల్స్‌లో పొందుపరచాలి. ఈ వ్యవహారమంతా రెస్కోలోని అడ్మినిస్ట్రేషన్ విభాగం చూసుకుంటుంది. ఇదిగో.. ఇక్కడే కీలకమైన పోస్టులో కూర్చున్న ఒక సీనియర్ అసిస్టెంట్ చక్రం తిప్పాడు. 'కృష్ణ'మాయతో సర్వం తానై వ్యవహరించారు. రెస్కోలో జరిగిన ప్రతి అవినీతి చర్య వెనుకా ఆ ఉద్యోగి కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం గుడుపల్లె రెస్కోలో బదిలీ మీద వెళ్లిన ఆ ఉద్యోగి.. 2014 మార్చిలో కన్సాలిడేటెడ్ పే మీద రెస్కోలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. 2016లో రెగ్యులరైజ్ అయ్యారు. వి.కోట సెక్షన్‌లో పనిచేస్తున్నప్పుడు 2018-19లో ఏడాదిపాటు సస్పెండయ్యారు. అప్పట్లో రూ.2.55 లక్షలను దుర్వినియోగం చేశారని ఆ అధికారిపై ఫిర్యాదు వచ్చింది. ఇది నిజమని విచారణలో తేలడంతో సస్పెండయ్యారు. తర్వాత ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించేశారు. 2019 సెప్టెంబరులో జూనియర్ అసిస్టెంట్‌గానే రీ జాయిన్ అయ్యారు. ఏడాదికంతా సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది, కీలకమైన అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌లో చక్రం తిప్పడం ప్రారంభించారు. సాధారణంగా రెస్కోలో తర్వాతి కేడర్‌కు పదోన్నతి లభించాలంటే కనీసం ఐదేళ్ల సర్వీసు ఉండాలి. జూనియర్ అసిస్టెంట్‌నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్న పొందడంలో ఈ నిబంధన ఈ కీలక ఉద్యోగికి వర్తించలేదు. గతంలో నిధుల దుర్వినియోగం కింద సస్పెండైన రికార్డునూ పరిగణనలోకి తీసుకోలేదు. ఇక, తన ఏడాది సస్పెన్షన్ కాలాన్ని వివిధ సెలవులుగా (ఎర్న్‌డ్, ఆఫ్ పే, లాస్ ఆఫ్ పే) మార్చుకోవడమూ ఆ ఉద్యోగికే సాధ్యమైంది.

### 'కృష్ణ'మాయాజాలంలో జరిగిన కొన్ని అవినీతి చర్యలు

- అక్రమంగా 122 మంది ఉద్యోగుల నియామకం
- ఎన్నికల నోటిఫికేషన్ వెలువడానికి మూడు రోజుల ముందు 52 మందికి అడ్డగోలు పదోన్నతులు
- రూ.30 లక్షలనుంచి రూ.45 లక్షలదాకా విద్యుత్తు బకాయిలు వసూలు చేసి స్వాహా చేయడం
- మాజీ ఎండీ ఉపయోగించిన సంస్థకు చెందిన వాహనాన్ని బెంగళూరు మెకానిక్ షాపులో వదిలేస్తే, రిపేరుకు మాత్రమే రూ.4 లక్షలు వ్యయమవుతుందని తప్పుడు బిల్లులు సృష్టించడం. (అప్పుడెప్పుడో చెల్లించిన రూ.1.50 లక్షలతోనే సరిపెట్టేసుకుని చివరకు ఈ వాహనాన్ని రెండు రోజుల క్రితం సదరు మెకానిక్ షాపు వాళ్లు వెనక్కు ఇచ్చేశారు)
- ఇంకా మాజీ ఎండీ వాడుతున్న పాత వాహనం ప్రయాణ దూరాన్ని అధికంగా చూపి ఆమేరకు డీజిలు బిల్లులు పెట్టి స్వాహా చేయడం.
- అర్హతలేని నలుగురికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించడం
- అప్పట్లో రెస్కో ఆధ్వర్యంలో నడుస్తున్న జేమ్స్ యెన్ పాలిటెక్నిక్ నుంచి ఒక ఉద్యోగిని రెస్కోలోకి తీసుకుని, అనతికాలంలోనే మూడు మెట్లు ఎక్కించి డీఈగా పదోన్నతి కల్పించడం.

### ఎండీల సంపూర్ణ సహకారం

ఇన్ని అవకతవకలు, అవినీతి చర్యలు, అడ్డగోలు వ్యవహారాలకు ఒక సీనియర్ అసిస్టెంట్ పాల్పడడం వెనుక మాజీ ఎండీ సుబ్రహ్మణ్యం, ప్రస్తుత ఎండీ ప్రభాకర్ సహకారం ఉంది. వీరిద్దరి సర్టిఫికెట్లు, పదోన్నతులు కూడా వివాదాస్పదం కావడం తెలిసిందే. వీటి వెనుకా ఈ కీలక ఉద్యోగి చేతివాటం ఉన్నదన్నది బహిరంగ రహస్యం. ఇక, ఏఏవో ద్వారా వ్యవహారాలు నడిపారు. ఉద్యోగం తీసిస్తానని ఒక నిరుద్యోగినుంచి ఆ ఏఏవో ఏకంగా రూ.8 లక్షలు వసూలు చేశారు. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది కూడా. భయపడిన సదరు ఏఏవో మూడునాలుగు రోజుల క్రితం ఆ నిరుద్యోగికి రూ.8 లక్షలు వెనక్కు ఇచ్చేశారని సమాచారం. ఇక, నాటి సహకార శాఖాధికారులకూ ఈ కీలక ఉద్యోగిపై మమకారం ఎక్కువే. అందుకనే, సస్పెండైనా పదోన్నతి లభించడం, సర్వీసు రిజిస్టర్ మాయం చేసినా బదిలీతో సరిపెట్టారన్న ఆరోపణలున్నాయి. ఇలా ఒక సీనియర్ అసిస్టెంట్ అటు సహకారశాఖలో.. ఇటు రెస్కోలో తన 'కృష్ణ'మాయను ప్రదర్శించారు.

### సర్వీసు రిజిస్టర్ మాయం చేసినా బదిలీతో సరి

కుప్పం రెస్కోలో ఇటీవల ఉద్యోగుల సర్వీసు రిజిస్టర్ మాయమైంది. మాజీ ఎండీ ఇంటికి చేరిందని, పాత డేట్లతో ఆయన ఉద్యోగుల సర్వీసు, ఇంక్రిమెంట్లు ఇతర విషయాలకు సంబంధించిన ఆపత తేదీలతో సంతకాలు చేయడానికే ఇది జరిగిందని గగ్గోలు పుట్టింది. సర్వీసు రిజిస్టర్ మాయం చేయగలిగిన సమర్థులు ఈ కీలక ఉద్యోగి తప్ప మరెవరూ కాదనీ తేలింది. సాధారణంగా ఉద్యోగుల సర్వీసు రిజిస్టర్ మాయం చేయడం చాలాపెద్ద నేరం. ఇక్కడ నేరం రుజువైనా సరే ఆ ఉద్యోగిని గుడుపల్లె సెక్షన్‌కు బదిలీచేసి వదిలేశారంతే. ఈ చర్య జరిగింది టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాకే. ఇందులో ఉన్నతాధికారుల బాధ్యతారహితంగా.. అవినీతికి కొమ్ముకాసేలా వ్యవహరించడం విమర్శలపాలైంది. ప్రస్తుత పాలకులూ దీనిని పట్టించుకోకపోవడం గమనార్హం.

### విచారణలో నిగ్గు తేల్చాల్సిందే

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే రెస్కోలో అవినీతి, అక్రమాలపై విచారణ మొదలు పెట్టింది. కానీ, సంబంధిత అధికారులు గతంలో ఆయా అక్రమ చర్యలు జరుగుతుండగా ప్రేక్షక పాత్ర వహించిన వారే. ఇప్పుడు ప్రభుత్వం విచారణాధికారిగా సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మిని నియమించింది. ఆమె ఈనెల 18న కుప్పం వచ్చి విచారణ చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన రికార్డులన్నీ ఇవ్వాలని రెస్కో ఉన్నతాధికారికి ఆమె లేఖ రాశారు. విచారణ సమయంలో పైన పేర్కొన్న కీలక ఉద్యోగిని ప్రశ్నిస్తే రెస్కోలో అన్నిరకాలైన అవినీతి, అక్రమాలు పూర్తిగా వెలుగు చూసే అవకాశం ఉంది. అలాగే రెస్కో ఎండీగా తిరుపతి ఎస్పీడీసీఎల్ ఈఈ సోమశేఖర్ నియమితులయ్యారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. రెస్కో గత అక్రమాలపై అప్రమత్తంగా ఉండకపోతే ఆ ఊబిలో నూతన ఎండీ కూడా కూరుకుపోయే ప్రమాదం ఉంది.

## టీడీపీ విజయంపై తిరుమలకు పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి అర్బన్, జూలై 14: కూటమికి అధికారం దక్కడం, చంద్రబాబు మరో విడత ముఖ్యమంత్రి కావడంతో బాపట్ల జిల్లా కొల్లూరు మండలం మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుతోపాటు పలువురు బాపట్ల నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ఈనెల 1న కొల్లూరు మండలం నుంచి వీరు పాదయాత్ర ప్రారంభించారు. దాదాపు 14రోజుల పాటు 400 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తూ ఆదివారం సాయంత్రం తిరుపతి చేరుకున్నారు. నగర శివారులో ఆయనకు రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కరణం హిమ్మత్ స్వాగతం పలికి అభినందించారు.

## పెయింటింగ్ విజేతలకు బహుమతులు



మంగళం, జూలై 14: తిరుపతి ప్రాంతీయ విజ్ఞానకేంద్రం, వే ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం గ్రీన్ వే లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించాయి ఈ కార్యక్రమంలో భాగంగా 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు చెట్టు నాటి ప్రాణాలను కాపాడుకుందాం అనే అంశంపై పెయింటింగ్ పోటీలను నిర్వహించాయి. పోటీల్లో తిరుపతి, నగరి, సదుం నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా తుడా వీసీ వెంకటనారాయణ, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ మధుసూదన్, వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఫైడి అంకయ్య హాజరయ్యారు. రీజనల్ సైన్స్ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ మాట్లాడుతూ పర్యావరణ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏడాదికి లక్ష చెట్లను నాటడం లక్ష్యంగా గ్రీన్ వే లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పెయింటింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు.

## చిన్నారులపై అత్యాచారాలను అరికట్టాలి

● ఎస్ఎఫ్ఐ, ఐద్వా నిరసన ప్రదర్శన




కొవ్వొత్తుల ప్రదర్శనలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు, విద్యార్థులు

తిరుపతి(విద్య), జూలై 14: నంద్యాల జిల్లాలో ఓ చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసినవారిని శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక దండిమార్చ్ సర్కిల్ వద్ద ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించి, కొవ్వొత్తులతో నివాళులర్పించాయి. ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ... రాష్ట్రంలో నేరాలు పెరిగిపోయాయన్నారు. చిన్నారులపై అత్యాచారాలు ఎక్కువయ్యాయన్నారు. చిన్నారి మృతదేహం కూడా దొరకకపోవడం విచారకరమన్నారు. ఏర్పేడు చిన్నారి ఘటన దుర్మార్గమన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు జయంతి, ఎస్ఎఫ్ఐ ఆఫీస్ బేరర్స్ వినోద్, తేజ, ఇతర నాయకులు భార్గవ్, నరేంద్ర, శ్రీనివాస్, గణేష్, హర్షద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లెలో వైభవంగా మాతమ్మ ఉత్సవం



సారె సమర్పిస్తున్న దొడ్ల కరుణాకర్‌రెడ్డి

తిరుపతిరూరల్, జూలై14: తుమ్మలగుంట పంచాయతీ ఉప్పరపల్లెలో ఆదివారం మాతమ్మ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి అమ్మవారికి సాంప్రదాయంగా పసుపు, కుంకుమ, పూలమాలతో కూడిన సారెను సమర్పించారు. మొక్కు చెల్లించారు. ఈయనకు ఆలయ నిర్వాకులు స్వాగతం పలికి అమ్మవారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. టీడీపీ నాయకులు చెంగల్రామానాయుడు, రాజారాయల్, రేవంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చెంచుశేఖర్, సురేష్, ఉమాపతి, నవీన్, అయ్యప్ప, బాలాజి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కైంకర్యాలు చేసుకోవడానికి సహాయం చేయండి

● ఎక్స్‌లో రమణదీక్షితుల పోస్ట్

తిరుమల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తమ కైంకర్యాలు ప్రశాంత వాతావరణంలో చేసుకోవడానికి సహాయం చేయాలంటూ టీటీడీ మాజీ ప్రధాన అర్చకుడు రమణదీక్షితులు ఏపీ సీఎంను ట్యాగ్ చేస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. టీటీడీలో ఇద్దరు ప్రధాన అర్చకులు ఐదేళ్ల పాటు అక్రమ కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, సాయం చేయాలంటూ కోరారు. టీటీడీపై, ఈవో ధర్మారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఓ వీడియో బయటకు వచ్చిన నేపథ్యంలో రమణదీక్షితులను టీటీడీ నుంచి తొలగించడంతోపాటు కేసులు పెట్టిన విషయం తెలిసిందే.



## ప్రశాంతంగా యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్షలు



రూం నంబర్లను చెక్ చేసుకుంటున్న అభ్యర్థులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 14: నగరంలో ఆదివారం యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఉదయం జరిగిన సెషన్‌కు 668మంది, మధ్యాహ్నం పేపర్-2కు 669 మంది హాజరైనట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మూడు కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి.

## రేపు ఆణివార ఆస్థానం

తిరుపతి (కల్చరల్) జూలై 14: నగరంలోని గోవిందరాజ స్వామి, కోదండరామ స్వామి ఆలయాల్లో ఈనెల 16న ఆణివార ఆస్థానం నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. గోవిందరాజ స్వామి ఆలయంలో సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు బంగారు వాకిలి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి వారిని వేంచేపు చేసి, ఆస్థానం నిర్వహిస్తారు. పుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుంచి నూతన వస్త్రాలను తీసుకువచ్చి గోవిందరాజ స్వామికి సమర్పిస్తారు. కోదండరామస్వామి ఆలయంలో కూడా సాయంత్రం 4-5 గంటల మధ్య సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామిని గరుడాళ్వార్ సన్నిధికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహిస్తారు. ఇందులో తిరుమల జీయరు స్వాములు, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొంటారు.

## రోడ్డు ప్రమాదంలో ఆడిటరుకు గాయాలు

తిరుపతిరూరల్, జూలై 14: వేదాంతపురం అగ్రహారం సర్కిల్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతికి చెందిన ఆడిటర్ సీ శ్రీనివాసులురెడ్డి గాయపడ్డారు. ఆర్సీపురం వెళ్లే మార్గంలో అగ్రహారం వద్ద ఎడమ వైపు ద్విచక్ర వాహనంపై ఉన్న ఆయనను అదేమార్గంలో అతివేగంగా డ్యూక్ బైక్‌పై వచ్చిన ఓ బాలుడు ఢీకొట్టాడు. దీంతో శ్రీనివాసులురెడ్డి కాలికి గాయాలయ్యాయి. స్థానికులు రుయాస్పత్రికి తరలించారు. కాగా, నగరంలో ఈమధ్య తరచూ మైనర్లు వాయువేగంతో బైకులు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. పోలీసులు దృష్టి సారించి వీరిని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## విస్తృతంగా జనసేన సభ్యత్వ నమోదు చేపట్టాలి



నాదెండ్ల మనోహర్‌తో రాజారెడ్డి

తిరుపతి అర్బన్, జూలై 14: జనసేన క్రియాశీలక సభ్యత్వం నమోదు ప్రక్రియ విస్తృతంగా చేపట్టాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆ పార్టీ నగర అధ్యక్షుడు రాజారెడ్డికి సూచించారు. ఆదివారం మధ్యాహ్నం తెనాలి పార్టీ కార్యాలయంలో మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనెల 18నుంచి 28వరకు క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. తిరుపతి నియోజకవర్గం పరిధిలో గతంలో నమోదుచేసిన 4,750సంఖ్యను అధిగమించాలని సూచించారు. కష్టపడిన కార్యకర్తలను గుర్తు పెట్టుకుంటామ హామీ ఇచ్చినట్లు రాజారెడ్డి చెప్పారు.

## వర్షం వస్తే బతుకు బస్టాండే..

**సెంట్రల్ బస్సు స్టేషన్‌లో ప్రయాణికుల అవస్థలు**





గతుకులలో వర్షపునీరు, బురద మధ్య ప్రయాణికుల అవస్థలు, నడిచే మార్గంలో కార్గో వస్తువులు



సీలింగ్ నుంచి ఉరుస్తున్న నీరు, కింద బకెట్

తిరుపతి(ఆర్టీసీ), జూలై 14: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ద్వారకా సెంట్రల్ బస్సు స్టేషన్ ఆవరణ చిత్తడిగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో రోజుకు దాదాపు లక్ష మంది ప్రయాణికులు రాకపోకలు జరుపుతుంటారు. ఇందుకు దీటుగా బస్టాండు నిర్వహణ లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆదివారం కురిసిన కొద్దిపాటి వానకే బస్ స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద సీలింగ్ నుంచి నీరు ఉరుస్తోంది. ఫ్లోర్‌పై నీటి చెమ్మతో ఎక్కువమంది జారిపడుతున్నారు. పగిలిన టాయిలెట్లు, అపరిశుభ్రత, తడిసిన చెత్తతో దుర్గంధం వెలువడుతోంది.దుకాణాల వారు తమ వస్తుసామగ్రితో స్థలాక్రమణ చేస్తుండటంతో ఆమార్గాన నడిచేందుకు కూడా చోటు ఉండటం లేదు. హోటల్స్ ముందు వ్యర్థాల నిల్వలతో అపరిశుభ్రత తాండవిస్తోంది. బస్టాండ్ ప్రాంగణం గతుకులమయంగా మారింది. ఆదివారం వస్తే ఎక్కువమంది సిబ్బంది సెలవు పెడుతుండడంతో పర్యవేక్షణ కొరవడుతోంది.

## తిరుపతిలో పనిచేయడం పూర్వజన్మ సుకృతం : ఎస్పీ




హర్షవర్ధన రాజును సన్మానిస్తున్న పోలీసు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 14: తిరుపతి జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు అన్నారు. కడప జిల్లాకు బదిలీపై వెళుతున్న ఆయనను పోలీసు అధికారులు ఆదివారం రాత్రి స్థానిక పోలీసు అతిథిగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వెంకటేశ్వరుడు కొలువైన చోట సంతృప్తికర సేవలు అందించామన్నారు. కీలక దశలో బాధ్యతలు చేపట్టి ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో అందరి సహకారం మరచిపోలేనన్నారు. హోంగార్డు నుంచి ఉన్నతాధికారి వరకు తనకు అందరూ సమానమేనన్నారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్ మాట్లాడుతూ సమర్థవంతమైన అధికారి వద్ద పనిచేయడం గొప్పగా భావిస్తున్నామన్నారు. జిల్లా పోలీసు శాఖ తరపున ఎస్పీని గజమాలతో సత్కరించి శాలువా కప్పి వీడ్కోలు పలికారు. వీడ్కోలు సభలో అదనపు ఎస్పీ విమలకుమారి, డీఎస్పీలు రవిమనోహరాచ్చారి, భవ్యకిషోర్, రమణకుమార్, రవికుమార్‌తో పాటు జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రాయలసీమలో పారిశ్రామికాభివృద్ధికి కృషి

● ప్రభుత్వ ఛీఫ్ సెక్రటరీని కోరిన భానుప్రకాష్‌రెడ్డి



ఛీఫ్ సెక్రటరీతో భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి (ఉపాధ్యాయనగర్), జూలై 14: రాయలసీమ పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ఇచ్చేలా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ఛీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్‌ను కోరారు. ఆదివారం తిరుపతికి వచ్చిన సీఎస్‌ను భానుప్రకాష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం చేసిన తప్పిదాలవల్ల రాయలసీమ యువత తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రాయలసీమ అభివృద్ధికి చేయూతనందించాలని కోరారు.

## ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు



హారతి ఇస్తున్న రమ్యానందభారతి

రామచంద్రాపురం, జూలై 14: మండలంలోని శ్రీశక్తి పీఠంలో గత 9రోజులుగా నిర్వహించిన వారాహి నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా భూగర్భ శ్వేత వారాహి దేవికి తిరుమంజనం నిర్వహించి, వజ్ర వారాహిదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు 9గంటలకు వేదమంత్రోచ్చరణల మధ్య వారాహి హోమాన్ని ప్రారంభించగా, కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి 12గంటలకు పూర్ణాహుతితో ముగించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అమ్మవారికి ఊంజల్‌సేవ మేళతాళాల నడుమ కన్నులపండువగా జరిగింది. రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉభయరాష్ట్రాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

## భవనంపై నుంచి జారిపడి విద్యార్థినికి తీవ్రగాయాలు



రుయాలో చికిత్స పొందుతున్న భావన

తిరుపతి రూరల్,జూలై14: తిరుపతిలో ఎస్వీ వెటర్నరీ వర్సిటీ కళాశాలలో బీవీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని భావన ఆదివారం ఉదయం హాస్టల్ భవనంపై జారిపడి తీవ్రగాయాలపాలైంది. చిత్తూరుకు చెందిన ఈ విద్యార్థిని ఉదయం టిఫిన్ తిన్నాకా హాస్టల్ భవనంపైకి ఎక్కి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి కింద పడిందని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. విద్యార్థినిని వెంటనే రుయాకు తరలించారు. వెన్నుముక, కుడిచేయికి బలమైన గాయాలైనట్లు గుర్తించారు. తల్లిదండ్రులు చేరుకుని కుమార్తెను వేలూరు సీఎంసీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో సెల్ఫీ తీసుకునేందుకు భావన హాస్టల్ భవనంపై ఓపెన్‌ఏరియాలోకి వెళ్లిందని సహచర విద్యార్థులు చెబుతున్నారు. సిమెంటు వాటర్ ట్యాంకుపైకి ఎక్కి సెల్ఫీ తీసుకుంటుండగా కాలిజారి కిందపడి ఉండొచ్చంటున్నారు. వర్షాలకు ట్యాంకుపై నాచు పేరుకుపోయి ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.

## సాధారణ ప్రయాణికులకు సీటు గగనమే

**రైళ్లలో తగ్గిన స్లీపర్, జనరల్ బోగీలు**

తిరుపతి(ఆటోనగర్), జూలై14: తిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే ఎక్స్‌ప్రెస్ రైళ్ళలో సాధారణ, మధ్యతరగతి వర్గాలకు సౌకర్య ప్రయాణం ఎండమావిగా మారింది. నిత్యం సీట్ల కోసం వీరు కుస్తీ పడాల్సి వస్తోంది. స్లీపర్ క్లాస్‌లో సీట్లు దొరకని వారికి జనరల్ కోచ్‌లో కాలు మోపే అవకాశం కూడా ఉండటం లేదు. దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక రాబడి వచ్చే రైల్వే స్టేషన్లలో తిరుపతి ఒకటి. వేంకటేశ్వర స్వామి ఆలయం ఇక్కడ ఉండటం వల్ల రైల్వేలో ఈ స్టేషన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. రైళ్ల ద్వారా రోజూ తిరుపతికి సుమారు 80 వేలమందికి పైగా రాక పోకలు సాగిస్తున్నారు. పదేళ్ల క్రితం వరకు సాధారణ, మధ్యతరగతి వర్గాలు ప్రయాణించడానికి అధికారులు ప్రాధాన్యత కల్పించేవారు. తర్వాత కేంద్రం రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో విలీనం చేసింది. అప్పటి నుంచి రాబడి పెంచుకోవడం కోసం అగ్రశ్రేణి ప్రయాణికులకే ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగానే ఎక్స్‌ప్రెస్‌లో మూడు ఏసీ బోగీలున్న చోట ఏడు బోగీలను పెంచింది. నాలుగు సాధారణ బోగీలను రెండుకు తగ్గించింది. నాలుగు స్లీపర్ బోగీలనూ తగ్గించింది. దీంతో సాధారణ, మధ్యతరగతి ప్రయాణికులు సీట్లు లభించడం లేదు. గమ్యం చేరుకోడానికి నానా అవస్థలూ తప్పడం లేదు.

## మురికి కాలువతో ముప్పు



హీరో హోండా షోరూమ్ ఎదుట మురికి కాలువ

తిరుపతి(ఆటోనగర్), జూలై14: తిరుపతి-రేణిగుంట మార్గంలో హీరో హోండా షోరూమ్ ఎదుట రైల్వే గేటు మలుపు వద్ద మురికి కాలువపై బండలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. నగర పాలక సంస్థ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ఈ మార్గంలో రోజూ వందల వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. వర్షం వస్తే ఇక్కడి పల్లపు ప్రాంతాలతో పాటు మురికి కాలువలు మునిగిపోతాయి. ఈ సమయంలో నగరపాలక సంస్థ కాలువపై ఉన్న గోతుల్లో పడి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. పలువురు క్షతగాత్రులవుతున్నారు. తాము కూడా నష్టపోతున్నామని చిరువ్యాపారులు వాపోతున్నారు. రైల్వే గేటుకు రోడ్డుకు తూర్పు వైపు నగర పాలక మురికి కాలువపై ఫుట్ పాత్‌ను ఏర్పాటు చేశారు. పడమట వైపు రోడ్డు దుర్భరంగా తయారైనా కనీసం కాలువపై బండలు వేయకపోవడం దారుణం. కమిషనర్ స్పందించి మురికి కాలువపై బండలు వేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

## గుంతల రోడ్లతో ఇబ్బందులు



గుంతలు తేలిన రోడ్లలో నిలిచిన వర్షపునీరు

మంగళం, జూలై 14: శెట్టిపల్లి రోడ్లు గుంతలతో దారుణంగా మారాయి. కొద్దిపాటి వర్షం పడితే గుంతల్లో నీరు చేరి వాహనచోదకులు, పాదాచారులకు ఇబ్బందికరంగా తయారవుతున్నాయి. గత ప్రభుత్వం శెట్టిపల్లిని కార్పొరేషన్‌లో విలీనం చేసినా ఎలాంటి అభివృద్ధి జరగలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కార్పొరేషన్‌లో కలవకముందు ఏ సమస్య వచ్చినా పంచాయతీలో చెబితే స్పందించేవారంటున్నారు. ఇపుడు తమ సమస్యలను కార్పొరేషన్ అధికారులకు నివేదించినా పట్టించుకునే పరిస్థితుల్లో లేరంటున్నారు. వర్షాలు కురుస్తుండటంతో మరింత గుంతలు ఏర్పడే అవకాశం ఉందని వీరు ఆందోళన చెందుతున్నారు. తిరగాలంటే ఇబ్బందికరంగా ఉందని వాపోతున్నారు.

## ఆరోగ్యానికి బాట..పెరటి,మిద్దె తోట




మొక్కలతో మహిళలు

తిరుపతి (కల్చరల్) జూలై 14: మారుతున్న జీవన విధానంలో ఆరోగ్యంగా ఉండాలంటే పెరటి, మిద్దె తోటల పెంపకం పెరగాలని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కేటీ రామకృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం తిరుపతి పద్మావతిపురంలో ఒన్ ఎర్త్ - ఒన్ లైఫ్ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆరోగ్యం కోసం ఇంటి వద్దే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు పండించుకోవలసిన అవసరం ఉందన్నారు. ఇందుకు సేవా సంస్థలు నిర్వహిస్తున్న అవగాహనా కార్యక్రమాలు ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో భాగంగా మిద్దె, పెరటితోటల పెంపకందారులకు 30 రకాల నాటు ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల విత్తనాలు, బంతి, చామంతి, మందారం, బచ్చలి, తమలపాకు మొక్కలను ఉచితంగా నిర్వాహకులు అందజేశారు. వెంకటరమణ, భానుప్రియ, శ్రుతి, పలువురు పెరటి తోటల పెంపకందారులు పాల్గొన్నారు.

## చెరువుల అభివృద్ధికి సహకరించండి

**జల వనరుల శాఖ మంత్రి నిమ్మలకు పాశిం వినతి**


మంత్రికి అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం

గూడూరు అర్బన్, జూలై 14: నియోజకవర్గ పరిధి టలో చెరువుల అభివృద్ధికి సహకరించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి ఆదివారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ విన్నవించారు. ఆదివారం నెల్లూరు జిల్లాలోని సోమశిల, కండలేరు ప్రాజక్టుల పరిశీలనకు వచ్చిన మంత్రి నిమ్మలతోపాటు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఎమ్మెల్యే మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సోమశిల, కండలేరు జలాశాయల నుంచి గూడూరు నియోజక వర్గానికి నీటిని సరఫరా చేయడం ద్వారా ఇటు రైతులకు అటు ప్రజలకు నీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ, దేవాలయాల అభివృద్ధికి సహకరించాలని సంబంధిత శాఖ మంత్రులను కోరినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ సీనియర్ నాయకుడు కొండేపాటి గంగాప్రసాద్ కూడా ఉన్నారు.

### ముత్యాలమ్మకు ఆదివారం పూజలు



చిల్లకూరు, జూలై 14: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మకు ఆదివారం పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టారు.

### కోటమ్మకు...



కోట, జూలై 14: కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

### 19న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నాయుడుపేట టౌన్, జూలై 14: నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 19వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌వర్మ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఐసీఐసీఐ బ్యాంక్ వారు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. డిగ్రీ, బీఎస్సీ, బీకాం, బీఏ, బీసీఏ, బీబీఏ పూర్తి చేసిన వారు, డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా అర్హులని ఆయన తెలిపారు. 19వ తేదీ 10 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

### ప్లాస్టిక్‌తో పొంచి ఉన్న ప్రమాదం

● కాలువల్లో పేరుకుపోతున్న కవర్లు


వెంకటగిరి పట్టణంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు

వెంకటగిరి టౌన్, జూలై 14: ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరుగుతండటంతో పర్యావరణానికి ముప్పు పొంచి ఉంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తున్న దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి వాటని స్వాధీనం చేసుకోవడమేకాకుండా సదరు యజమానికి జరిమానా విధించాల్సి ఉంది. అయితే ఇది సక్రమంగా అమలు కాకపోవడంతో వెంకటగిరి పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వస్తువులే కనిపిస్తున్నాయి. ఏ దుకాణంలో చూసినా ప్లాస్టిక్ కవర్లు విచ్చల విడిగా విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

### మోస్తరు వర్షం

వెంకటగిరి టౌన్, జూలై 14: పట్టణంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి చిరుజల్లులు కురిశాయి. ఆదివారం ఉదయం మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజులుగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలకు ఊరట కల్గింది. ఆరుతడి పంటలు వేసుకున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఆహార పొట్లాల పంపిణీ

వెంకటగిరిటౌన్, జూలై 14: పట్టణంలోని నిరుపేదలకు స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో ప్రకృతి కుమార్ ఆదివారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఆదివారం పేదలకు ఏదో ఒక రూపంలో సాయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోపీనాథ్, గురవయ్య, రాంప్రసాద్, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

### కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పించండి

● తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి మునిరాజా


నరసింహయాదవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

సూళ్లూరుపేట, జూలై 14: కష్టకాలం, ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీ కోసం పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పించాలని తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి శివశంకర నాపా మునిరాజా అన్నారు. ఆదివారం ఆయన టీడీపీ నాయకులు, దేవాంగ సాధికార కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ పార్టీ కష్టకాలంలో బలోపేతం కోసం కష్టపడ్డారని, వారికి నామినేటెడ్ పదవులు వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుమహిళా నాయకురాలు బుద్ధి విజయలక్ష్మి, హరి, శారద, వెంకటేశ్, గిరి ప్రసాద్, నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# సహకార సంఘాలకు మంచిరోజులు

● జగన్ జమానాలో గాడి తప్పిన పీఏసీఎస్‌లు
● ఎన్నికలు నిర్వహించకుండా పార్టీ నేతల పెత్తనం
● పర్సన్ ఇన్‌చార్జులుగా అధికారుల్ని నియమించిన కొత్త ప్రభుత్వం
● సంఘాలు గాడిన పడతాయని రైతుల ఆశాభావం


నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

గూడూరు అర్బన్, జూలై 14: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్) సారథులు లేక నిస్తేజంగా తయారయ్యాయి. దశాబ్దం క్రితం జరిగినవే చివరి ఎన్నికలు. వైసీపీ ప్రభుత్వం మినహా అన్ని ప్రభుత్వాలు సహకార ఎన్నికల నిర్వహణ - రైతుల సంక్షేమంపై దృష్టి పెట్టాయి. జగన్ సర్కార్ ఐదేళ్లలో కనీసం ఎన్నికలు కూడా నిర్వహించలేకపోయిందనే అపవాదు మూటకట్టుకుంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి త్రీమెన్ కమిటీలతో కాలక్షేపం చేసేసింది. 11 సార్లు నామినేటెడ్ కమిటీలను కొనసాగించి అనుచరులకు పట్టం కట్టింది.

**ఎన్నికల ఊసేలేదు**

జిల్లాలో 80 పీఏసీఎస్‌లు ఉన్నాయి. 2013 ఫిబ్రవరిలో వీటికి ఎన్నికలు జరిగాయి. అప్పట్లో మెజార్టీ సొసైటీలను వైసీపీ కైవసం చేసుకుంది. కేంద్రసహకార బ్యాంకు అధ్యక్షుడిగా ధనుంజయరెడ్డి ఎన్నికయ్యారు. 2018 ఫిబ్రవరి నాటికి పదవీకాలం ముగిసింది. అప్పటి నుంచి నామినేటెడ్ పాలకవర్గాలు కొన...సాగాయి. 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో అప్పటి చంద్రబాబు సర్కారు 6నెలల చొప్పున రెండుసార్లు పాలకవర్గాలను పొడిగించింది. జగన్ ప్రభుత్వం కొలువుదీరాక ఎన్నికల జోలికి వెళ్లలేదు. కేంద్ర సహకార బ్యాంకుకు మెట్టుకూరు తరువాత ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి ఛైర్మన్‌గా నామినెట్ కాగా జిల్లా పరిషత్ ఎన్నికల తరువాత ఆయన సతీమణి అరుణమ్మ జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఆయన స్థానంలో పెళ్లకూరుకు చెందిన వైసీపీ నాయకుడు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి కొలువుదీరారు. మొన్నటి వరకు ఆయనే నామినేట్ ఛైర్మన్‌గా పెత్తనం చేశారు. జగన్ పాలనలో సహకార సంఘాలు జీవాన్ని కోల్పోయాయి. వైసీపీకి చెందిన ముగ్గురు త్రీమెన్ కమిటీగా నియమితులై పెత్తనం చేశారు. రైతులకు సేవలందించే ప్రధాన బాధ్యతను ఈ కమిటీలు పూర్తిగా పక్కన పెట్టాయి. సొసైటీ నిధులు- రుణాలను ఇష్టారీతిలో కొల్లగొట్టాయనే ఆరోపణలున్నాయి. యంత్ర సేవా కేంద్రాలనూ పూర్తిగా నిర్వీర్యం చేశాయి. యంత్రాలనే మాయం చేసేశాయి. ట్రాక్టర్లు, విత్తనాలు, మందుల పిచికారీ, దుక్కుల పనిముట్లు ఎక్కడా పనిచేయలేదు సరికదా... సొసైటీ కార్యాలయాలలోనూ కనిపించడంలేదు. రుణాల మంజూరులో కమిటీలదే సర్వాధికారం. వందలాది మంది మొండి బకాయిదారులుగా ఉన్నా తమకు గిట్టని, ప్రత్యర్థి పార్టీ వారిని భూముల వేలం పేరుతో వేధించారనే విమర్శలు ఉన్నాయి. బినామీ సభ్యుల పేర్లతో రుణాలు మంజూరు చేసుకుని పెద్దలు దోచుకున్నట్లు ఆరోపణలున్నాయి.

**వ్యవసాయశాఖ మంత్రి ఆరా**

చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడటంతో సహకార సంఘాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందన్న ఆశలు అన్నదాతల్లో చిగురించాయి. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఈ ఎన్నిక ప్రక్రియపై ఆరా తీసినట్లు తెలుస్తుంది. త్వరలోనే ఎన్నికలు నిర్వహించి పాలనను గాడిలో పెట్టేందుకు ప్రతిపాదనలు- సూచనలు చేసినట్లు సమాచారం. జగన్ జమానా మాదిరి కాకుండా అధికారులనే సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించడంతో ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతుంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు జాయింట్ కలెక్టర్ సేధుమాధవన్‌ను పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించింది.

# దారి కోసం 10 గ్రామాల ప్రజల వ్యథ

● స్పందించని అధికారులు, రోడ్డు పనుల కాంట్రాక్టర్


పెసల గుర్రప్పతోట వద్ద ప్రమాదకరంగా ఉన్న రహదారి

పెళ్లకూరు, జూలై 14 : మండలంలోని పెసల గుర్రప్పతోట సమీపంలో 71వ జాతీయ రహదారి నుంచి 10 గ్రామాలకు వెళ్లే దారి బురదమయంగా మారడంతో గ్రామీణులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా టెలికాం కేబుల్ లాగేందుకు దారి దిగే వద్ద పెద్ద గుంత తవ్వేశారు. దీంతో ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కప్పగుంటకండ్రిగ, పాలచ్చూరు, జంగాలపల్లి, దిరసనమాల, పెరుమాళ్లపల్లి, అనకవోలు, పిడికిటమాల, అనకవోలు తదితర గ్రామాలకు వెళ్లడానికి ఇదొక్కటే దారి. అయితే విస్తరణ పనుల్లో భాగంగా పెసల గుర్రప్పతోట వద్ద 71వ జాతీయ రహదారి దాటేందుకు ఎలాంటి క్రాసింగ్ వదలిపెట్టలేదు. ఇది ఆయా గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. జాతీయ రహదారి నుంచి 10 గ్రామాలకు వెళ్లే లింకు రోడ్డుకు మొదట్లో మట్టి పోశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుడడంతో బురదమయంగా మారింది. రోడ్డు ఛిద్రం కావడంతో వాహనదారులు జారి పడి గాయాలపాలవుతున్నారు. దీనికి తోడు ఆదివారం టెలికాం వైర్లు లాగేందుకు పెద్ద గుంత తవ్వేశారు. దీంతో ఈ దారిపై ప్రయాణించడానికి గ్రామీణులు భయాందోళన చెందుతున్నారు. ఇకనైన అధికారులు, స్పందించి రోడ్డు క్రాసింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గతంలో 71వ జాతీయ రహదారి ఆరు లేన్ల విస్తరణ పనులు చేపట్టే సమయంలో బాక్స్ టైప్ అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను ఈ ప్రాంత ప్రజలు వేడుకున్నా పట్టించుకోలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు, నూతన పాలకులు పట్టించుకోవాల్సి ఉంది.

### రక్షణగోడ లేక ప్రమాదాలు



గూడూరు, జూలై 14: స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని కాలువ వద్ద రక్షణ గోడ లేకపోవడంతో వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయని వాహన చోదకులు చెబుతున్నారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలో పంట కాలువపై నిర్మించిన రక్షణ గోడ కొన్నేళ్లక్రితం కూలిపోయింది. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో రక్షణగోడ లేకపోవడంతో కాలువ కనిపించక వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రక్షణగోడను ఏర్పాటు చేయడం కానీ, సూచికబోర్డును ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

### పేదలకు ఇసుక అందించేలా చర్యలు తీసుకోండి

**సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి**



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

గూడూరు, జూలై 14: పేదలందరికీ ఇసుక అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో సీపీఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక పాలసీ కారణంగా భవన నిర్మాణ రంగంతోపాటు అనుబంధ రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చినా... క్షేత్ర స్థాయిలో డంపింగ్ యార్డ్‌ల వద్ద వందలాది వాహనాలు క్యూలైన్లలో ఉండడంతో పేదలకు ఇసుక అందని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ సమస్యలను పరిష్కరించి పేదలకు ఇసుక కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈనెల 22న తిరుపతిలో జరిగే జిల్లాస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కాలేషా, శశికుమార్, ప్రసాద్, సీవీఆర్‌కుమార్, చంద్రయ్య, నారాయణ, రమేష్, భాస్కర్, కృష్ణ, శేషయ్య, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

# రొచ్చుగా మారిన రోడ్లు


క్రాస్ రోడ్డులో చెరువును తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు - చిత్తడిగా మారిన అంబేద్కర్ గురుకులానికి వెళ్లే రోడ్డు

కోట, జూలై 14: పట్టణంలోని రోడ్లు రొచ్చుగా మారాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిత్తడి మారాయి. పట్టణంలోని అంబేద్కర్ గురుకులానికి వేళ్లే దారి అడుసుమయంగా మారిపోయింది. ఆదివారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చూసుకునేందుకు వెళ్లిన అడుసు బురదలో తొక్కుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. సుమారు అర కిలోమీటరు వరకు ఉన్న ఈ రోడ్డు దుస్థితిలో ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అదే విధంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, గోపాల్‌రెడ్డి విగ్రహం, క్రాస్‌రోడ్డులలో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతినడంతో అటు పాదచారులు, ఇటు వాహనచోదకులను ఇబ్బందియి పడుతున్నారు.

### రోడ్డుపై నిలిచిన మురుగు

**వాకాడు:** మండలంలోని తిరుమూరు ఎస్సీ కాలనీలో అధికారుల పర్యవేక్షణ లోపంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన సిమెంటు రోడ్డుపై చిన్నపాటి వర్షానికే మురుగు చేరింది. ప్రజలు ద్విచక్రవానాలలో వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. పాదచారులు నడవాలంటే నరక యాతన తలపిస్తోంది. రోజులతరబడి మురుగ నిలిచి ఉండటంతో దోమలకు ఆవాసంగా మారింది. రెండేళ్లుగా తిరుమూరు ఎస్సీకాలనీ వాసులు డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్‌తో రోజులుతరబడి ఆసుపత్రులపాలైన సందర్భాలున్నాయి. డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో మురుగు నిలిచి ఉండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.


తిరుమూరు ఎస్సీకాలనీ రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు

### మహనీయుల త్యాగాలను స్మరించుకుందాం

కోట, జూలై 14: మహనీయుల త్యాగాలు, పోరాటాలు వృథా కానీ వ్వకుండా ఐక్యంగా కలసి పోరాడేందుకు బహుజనులంతా ఒకే వేదికపైకి రావాలని బహుజన ఐక్యవేదిక నాయకులు అన్నారు. కోటలోని షాదీమంజిల్‌లో ఈనెల 17న బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో కారంచేడు స్ఫూర్తి సభ జరుగుతుంది. ఈ సభ కరపత్రాలను ఆదివారం బహుజన ఐక్యవేదిక, బీఎస్పీ నాయకులు ఎం.మాధవ్, దాసరి సుందరం, రంగనాథ్, అశోక్‌కాంబ్లే గ్రామాల్లో పంచిపెట్టారు.. గూడలి, రుద్రవరం, ఊనుగుంటపాళెం, తిన్నెలపూడి, నెల్లూరుపల్లి కొత్తపాళెం, అగ్రహారం గ్రామాల్లో బహుజన ఐక్యవేదిక సభకు వేలాదిగా తరలిరావాలంటూ పిలుపునిచ్చారు.

### బ్రాహ్మణులకు అండగా నిలుద్దాం

కోట, జూలై 14: నిరుపేద బ్రాహ్మణులకు అండగా నిలిచి అన్ని విధాలా ఆదుకుంటామని శ్రీపట్టాభిరామ బ్రాహ్మణ సేవా సంఘ నాయకులు తెలిపారు. మండలంలోని విద్యానగర్‌లో ఆదివారం సంఘ జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా బ్రాహ్మణ సేవా సంఘ ఉపాధ్యక్షుడు యామానరావు, సోళాకుమార్‌తోపాటు జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన కె.ప్రసాదరావు, కె.సుధాకరరావు, సీతారామరావును సత్కరించారు. ఆగస్టులో విద్యానగర్‌లో నూతన బ్రాహ్మణ భవనం ప్రారంభంపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. శివకుమార్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని మృతికి కారకులపై చర్యలు తీసుకోండి


గురుకులం వద్ద ధర్నాలో ప్రజా సంఘాల నాయకులు - గురుకులంలో విచారణ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి

డక్కిలి, జూలై 14: పట్టణంలోని గురుకుల పాఠశాలలో 5వ తరగతి విద్యార్థిని షరీనా మృతికి సిబ్బందే కారణమని వారిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కళాశాలవద్ద ధర్నా చేపట్టారు. రాపూరు - వెంకటగిరిలో మార్గంలో చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడుతూ... ఘటనపై ఉన్నత స్థాయి అధికారులతో విచారణ చేపట్టే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా మంత్రుల పర్యటనకు హాజరయ్యేందుకు డక్కిలి మీదుగా కండలేరు జలాశయం వద్దకు వెళ్తతున్న టీడీపీ సీనియర్ నాయకుడు గంగాప్రసాద్, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యంకు ఘటనను వివరించారు. వెంటనే వారు గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థి మృతి చెందినా ఇక్కడకు ఎందుకు రాలేదని ఆర్డీవోని ప్రశ్నించారు. వేరే విధుల్లో ఉన్నందున రాలేక పోయానని, తక్షణం ఘటనపై విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో నిరసనకారులు శాంతించారు. ధర్నాలో ఎమ్మార్పీఎస్ నాయకులు జి.మునెయ్య, ఎం.సురేష్, బీఎస్పీ నాయకుడు జి. వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**డీఎంహెచ్‌వో, గురుకుల కన్వీనర్ విచారణ**

షరీనా మృతిపై ఆదివారం జిల్లా వైద్యాధికారి శ్రీహరి, తిరుపతి జిల్లా గురుకుల కళాశాల కన్వీనర్ పద్మజ వేర్వేరుగా విచారణ చేపట్టారు. విద్యార్థి మృతికి గల కారణాలపై ఆరాతీశారు. విద్యార్థినులను, ఉపాధ్యాయులను విచారించారు.

### భూపతేశ్వరుడికి ప్రత్యేక అభిషేకం



చిట్టమూరు, జూలై 14: మండలంలోని యాకశిరితిప్పలో కొలువై ఉన్న భూపతేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకాలతో పాటు ప్రత్యేక అలంకరణ నిర్వహిస్తారు. అందులో భాగంగా పాలు, పెరుగు, తేనె సహా వివిధ రకాల పండ్లతో అభిషేకించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నదానం జరిగింది.

# ఆహ్లాదాన్ని పంచని పార్కులు


ప్రహరీ కూలి అధ్వానంగా మారిన ఎన్టీఆర్ పార్కు

గూడూరు, జూలై 14: పట్టణంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్కుల ఆలనాపాలనా లేకపోవడంతో దుస్థితికి చేరుకున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టకపోవడంతో పట్టణవాసులు ఆహ్లాదాన్ని కోల్పోయారు. గూడురు పట్టణంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో గతంలో పార్కులను ఏర్పాటు చేశారు. అయితే కొనేళ్లగా నిర్వహణ మరిచిపోవడంతో నేడు అవి దుస్థితికి చేరుకుని నిరుపయోగంగా మారాయి. ప్రధానంగా పట్టణంలో ప్రజలు కొంతసేపు సేద తీరేందుకు పార్కులు నిర్మించి వాటిలో చెట్లను పెంచడంతో పాటు చిన్నపిల్లలు ఆటలు ఆడుకునేందుకు అనేక సౌకర్యాలను కల్పించారు. నేడు వాటి ప్రహరీలు కూలిపోయి, పిచ్చిచెట్లు పెరిగిపోయి అధ్వానంగా మారాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో నేడు దుస్థితిలో పార్కులు చేరుకున్నాయి. ప్రధానంగా పట్టణంలో సీవీసీ, పీఎస్ఆర్, వైఎస్ఆర్, ఎన్టీఆర్, సర్వేపల్లి రామారావు, అన్నంగి బాబురావు, రామ్‌నగర్ పార్కులను మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పార్కుల నిర్వహణను చేపట్టకపోవడంతో రెండు పార్కులు మినహా ఐదు పార్కులు దుస్థితికి చేరుకున్నాయి. గతంలో సిబ్బంది కొరత కారణంగా పార్కుల నిర్వహణ కష్టతరంగా ఉండేది. ప్రస్తుతం సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండడంతో పార్కులను అభివృద్ధి చేసి సచివాలయ సిబ్బందిని ఇన్‌చార్జులుగా ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు ఆహ్లాద వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మూతపడ్డ అన్నంగి బాబురావు పార్కు

### రైల్లో సీటు సాధారణ ప్రయాణికులకు ఎండమావే

● తగ్గిపోయిన స్లీపర్, జనరల్ బోగీలు

తిరుపతి(ఆటోనగర్)జూలై14: తిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సాధారణ, మధ్యతరగతి వర్గాలకు సౌకర్య ప్రయాణం ఎండమావిగా మారింది. నిత్యం సీట్ల కోసం వీరు కుస్తీ పడాల్సి వస్తోంది. స్లీపర్ క్లాస్‌లో సీట్లు దొరకని వారికి జనరల్ కోచ్‌లో కాలు మోపే అవకాశం కూడా ఉండటం లేదు. దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక రాబడి వచ్చే రైల్వే స్టేషన్లలో తిరుపతి ఒకటి. వేంకటేశ్వర స్వామి ఆలయం ఇక్కడ ఉండటం వల్ల రైల్వేలో ఈ స్టేషన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. రైళ్ల ద్వారా రోజూ తిరుపతికి సుమారు 80 వేలమందికి పైగా రాక పోకలు సాగిస్తున్నారు. పదేళ్ల క్రితం వరకు సాధారణ, మధ్యతరగతి వర్గాలు ప్రయాణించడానికి అధికారులు ప్రాధాన్యత కల్పించేవారు. తర్వాత కేంద్రం రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో విలీనం చేసింది. అప్పటి నుంచి రాబడి పెంచుకోవడం కోసం అగ్రశ్రేణి ప్రయాణికులకే ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగానే ఎక్స్‌ప్రెస్‌లో మూడు ఏసీ బోగీలున్న చోట ఏడు బోగీలను పెంచింది. నాలుగు సాధారణ బోగీలను రెండుకు తగ్గించింది. నాలుగు స్లీపర్ బోగీలనూ తగ్గించింది. దీంతో సాధారణ, మధ్యతరగతి ప్రయాణికులు సీట్లు లభించడం లేదు. గమ్యం చేరుకోడానికి నానా అవస్థలూ తప్పడం లేదు.

## ఆకట్టుకున్న హిడింబాసుర, బకాసుర వధ



భిక్షాటనకు బయలుదేరిన భీముని వేషధారులు

శ్రీకాళహస్తి, జూలై 14: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన ఆదివారం నిర్వహించిన హిడింబాసుర, బకాసుర వధ ఆకట్టుకుంది. హిడింబాసురుడు, బకాసురుడు సామాన్యులను వేధిస్తుండడంతో కుంతీదేవికి జనం మొరపెట్టుకుంటారు. వారిని వధించాలని తన కుమారుడైన భీమసేనుడిని కుంతీదేవి ఆదేశిస్తుంది. తల్లి ఆదేశాల మేరకు భీమసేనుడు వెళ్లి జనాన్ని పీడిస్తున్న హిడింబాసురుడు, బకాసురుని వధిస్తాడు. అంతకు మునుపు భీమసేనుడు పురవీధుల్లో భిక్షాటన చేస్తాడు. ఈ సన్నివేశాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## వేదపాఠశాల నెలకొల్పుతాం: సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 14: పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో వేద పాఠశాలను నెలకొల్పుతామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థంలో జనార్దనానంద సరస్వతి వేద విద్వాన్మహాసభ సరస్వతిస్వామి సంస్కృతి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వేదం భారతీయ సనాతన సంపద అని కొనియాడారు. వేద విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వేదపండితులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

శ్రీకాళహస్తి, జూలై 14: విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని ఆదివారం ఆపస్ నాయకులు కోరారు. ఆదివారం ఊరందూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయనను ఆపస్ నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబరు 117 రద్దు చేయాలన్నారు. విలీనం పేరుతో ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులను మిగులుగా చూపించి పోస్టులను తగ్గించారన్నారు. వారిని తిరిగి పునర్ నియమించాని కోరారు. ఖాళీ అయిన ఉపాధ్యాయ పోస్టులను ఈ డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారానే భర్తీ చేయాలని కోరారు. అలాగే ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలన్నారు. సీఆర్పీలు, మధ్యాహ్న భోజన సిబ్బంది, పాఠశాల స్కావెంజర్లకు, వాచ్‌మెన్‌లకు మూడు నెలలుగా జీతాలు రాలేదన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆపస్ నాయకులు బాలాజీ, తూకివాకం నాగరాజు, జగదీష్, మునీంద్రబాబు, చిట్టిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దోబీఘాట్ సమస్యలను పరిష్కరించండి

శ్రీకాళహస్తి, జూలై 14: శ్రీకాళహస్తి పట్టణంలోని దోబీఘాట్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డికి స్థానికులు విజ్ఞప్తి చేశారు. దోబీఘాట్ మరమ్మతులు, స్వర్ణముఖి డ్యాంపై ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె స్పందిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఉపేక్షించేది లేదన్నారు. తగుచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## విద్యాసామగ్రి పంపిణీ

ఏర్పేడు, జూలై 14: రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ కుమారుడు రిషి అద్వాని జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఏర్పేడు మండలం శ్రీనివాసపురం, అశోక్‌నగర్‌లో సత్యకుమార్ యాదవ్ సేన ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, సుబ్బారెడ్డి, భాస్కర్, శివారెడ్డి, తేజా యాదవ్, సర్పంచ్ శివయ్య, ఉపాధ్యాయులు వాసు తదితరులు పాల్గొన్నారు.

## పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయండి

శ్రీకాళహస్తి, జూలై 14: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి మురళి కోరారు. గత ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేస్తామని మాట తప్పి అసంబద్ధమైన జీపీఎస్ విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## కుక్కంబాకంలో పారిశుధ్య పనులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 14: మండలంలోని కుక్కంబాకం గ్రామంలో సర్పంచు ఢిల్లి, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య పనులను చేపట్టారు. రెండు రోజులు క్రితం డీపీవో సుశీలదేవి గ్రామంలో పర్యటించి పారిశుధ్యం మెరుగు పరచాలని అధికారులను ఆదేశించారు. దీంతో సర్పంచు, వైద్య సిబ్బంది కలిసి మురుగు కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లారు. అనంతరం గ్రామంలో సచివాలయ, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## శ్రీసిటీలో రేపు ఉద్యోగమేళా

సత్యవేడు, జూలై 14: శ్రీసిటీ, ఎంప్లాయ్‌బిలిటీ బ్రిడ్జి కంపెనీ సంయుక్త భాగస్వామ్యంతో ఈనెల 16న శ్రీసిటీలో ఫ్లాగ్ (ఫస్ట్‌లుక్ అట్ ఆస్పిరింగ్ గ్రాడ్యుయేట్స్) మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సోర్సింగ్ హెడ్ కవిశెల్వన్ తెలిపారు. స్థానిక సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రహదారిలోని శ్రీసిటీ బ్రేడ్ సెంటర్‌లో ఉదయం 8.30 గంటలకు ఉద్యోగ మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. 2022, 2023, 2024లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణులైన వారు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7305254222 నెంబరుకు ఫోన్‌చేయాలని సూచించారు.

## మొక్కు చెల్లింపు



పూజద్రవ్యాలు తీసుకెళుతున్న భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 14: శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డి విజయం సాధించడంతో కరుమారియమ్మ ఆలయ పూజారి పళనిస్వామి ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. బీపీ అగ్రహారం నుంచి ఊరేగింపుగా కరుమారియమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి పూజలు చేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాసరం రమేష్, కంఠా రమేష్, గురప్ప శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమావేశం



ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

నాగలాపురం, జూలై 14: నాగలాపురం మండలం బీర కుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశం అయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు నాయుడు, టీచర్లు దశరధుడు, కుప్పయ్య, మునయ్య, వాణిశ్రీ, సుధాకర్,మనోహర్, భాస్కర్, ఆనంద్, శేఖర్‌లను సన్మానించి నూతన వస్త్రాలు, స్వీట్లు, షీల్డ్‌లు అందజేశారు. జానికాపురం పాఠశాల ఉపాధ్యాయుడు విజయ కుమార్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్మశాన రోడ్డుకు మోక్షం

శ్రీకాళహస్తి, జూలై 14: శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లి దళితవాడ శ్మశాన వాటిక రోడ్డుకు మోక్షం లభించింది. గుంటకిందపల్లి పరిధిలోని అరుంధతివాడ, హరిజనవాడ శ్మశాన రోడ్డు సమస్య ఏళ్ల తరబడి వెంటాడింది. ఎన్నికలకు ముందు సుధీర్‌రెడ్డి ఇక్కడ శ్మశానానికి వెళ్లే రోడ్డు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచు పెంచులమ్మ ఎమ్మెల్యే సూచనలతో ఆదివారం శ్మశాన రోడ్డును పూర్తి చేశారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## భవనంపై నుంచి జారిపడి విద్యార్థినికి తీవ్రగాయాలు



భావన

తిరుపతి రూరల్, జూలై14: తిరుపతిలో ఎస్వీ వెటర్నరీ వర్సిటీ కళాశాలలో బీవీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని భావన ఆదివారం ఉదయం హాస్టల్ భవనంపై జారిపడి తీవ్రగాయాలపాలైంది. చిత్తూరుకుచెందిన ఈవిద్యార్థిని ఉదయం టిఫిన్ తిన్నాకా హాస్టల్ భవనంపైకి ఎక్కి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి కింద పడిందని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. విద్యార్థినిని వెంటనే రుయాకు తరలించారు. వెన్నుముక, కుడిచేయికి బలమైన గాయాలైనట్లు గుర్తించారు. తల్లిదండ్రులు చేరుకుని కుమార్తెను వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో సెల్ఫీ తీసుకునేందుకు భావన హాస్టల్ భవనంపై ఓపెన్ ఏరియాలోకి వెళ్లిందని సహచర విద్యార్థులు చెబుతున్నారు. సిమెంటు వాటర్ ట్యాంకుపైకి ఎక్కి సెల్ఫీ తీసుకుంటుండగా కాలిజారి కింద పడి ఉండొచ్చంటున్నారు. ట్యాంకుపై నాచు పేరుకుని ఉండటంతో ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.

# ఆరణియార్‌కు కృష్ణా జలాలను తరలించండి

### ఇరిగేషన్ మంత్రి నిమ్మలకు ఎమ్మెల్యే ఆదిమూలం వినతి



సమావేశంలో మంత్రులతో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు/పిచ్చాటూరు, జూలై 14: నియోజకవర్గంలోని ఆరణియార్ ప్రాజెక్టుకు గాలేరు - నగరి ద్వారా కృష్ణా జలాల తరలింపు పనులను చేపట్టాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. ఆదివారం నెల్లూరు జిల్లా కండలేరు రిజర్వాయరు వద్ద నీటిపారుదల శాఖ అతిథి గృహంలో జరిగిన సమావేశంలో మంత్రులు రామానాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిస్థితిని నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే ఆదిమూలం వివరించారు. ప్రధానంగా పుత్తూరు మండలం వేపగుంట చెరువు నుంచి గాలేరు - నగరి లింక్ చానల్‌ను ఏర్పాటు చేయాలని, అదే విధంగా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఆరణియార్ నీటిని కీళపూడి పంచాయతీలోని మెట్ట భూములకు నీరందించాలని, ఆరణియార్ నిర్వాసితులకు ఆదుకోవాలని కోరారు. అలాగే కేవీబీపురంలోని కాళంగి రిజర్వాయర్, ఓళ్లూరు చెరువులను ఆధునికీకరణ చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. సత్యవేడులో మంజూరైన టీటీడీ కల్యాణ మండపం పనులు వెంటనే చేపట్టాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. ఈ మేరకు మంత్రులకు వినతిపత్రాలను అందించారు. ఈ సమావేశంలతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్వేపల్లి, సూళ్లూరుపేట, వెంకటగిరి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, విజయశ్రీ, రామకృష్ణ, అధికారులు, టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఆ ఐఏఎస్‌లను దూరం పెట్టండి

### వైసీపీకి అంటకాగి, అడ్డగోలుగా దోచేశారు

### సీఎం, డిప్యూటీ సీఎంలకు రాష్ట్ర ఉద్యోగుల సంఘ మాజీ నేత నరసింహ నాయుడు లేఖ

తిరుపతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో పనిచేసిన కొంతమంది ఐఏఎస్ అధికారులు వైసీపీ నేతలకు ఊడిగం చేశారు.. అవినీతికి పాల్పడి అడ్డగోలుగా దోచేశారు.. అలాంటి వారిని దూరం పెట్టాలంటూ సీఎం నారా చంద్రబాబు నాయుడికి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు రాష్ట్ర ఉద్యోగుల సంఘ మాజీ నేత, జనసేన నాయకుడు నరసింహ నాయుడు లేఖ రాశారు. 'కలెక్టర్లుగా పనిచేసిన ప్రద్యుమ్న, సిద్ధార్థ జైన్, జేసీగా పనిచేసిన గిరీష, తిరుపతి సబ్ కలెక్టర్లుగా పనిచేసిన నిశాంత్, మహేష్ కుమార్‌లు అప్పటి వైసీపీ నేతలతో కలిసి అనేక అవకతవకలకు పాల్పడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి వేధించారు. 2019 ఎన్నికల్లో తిరుపతి ఎమ్మెల్యే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో ప్రద్యుమ్న హస్తముంది. ఈయన భార్య వైసీపీ లీగల్ సెల్‌లో ఉన్నారు. మరో కలెక్టర్ హరినారాయణ పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు పూర్తిసహాయ సహకారాలు అందజేశారు. జేసీగా ఉన్న గిరీష తిరుపతి విమానాశ్రయం వద్ద కర్ణాటకకు చెందిన తనవారికి 18 ఎకరాల భూమిని మెడికల్ కాలేజ్ నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారు. తిరుపతిలో ఎపిక్ కార్డుల కుంభకోణంలోనూ ఇరుక్కున్నారు. అప్పట్లో చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సిద్ధార్థ జైన్ అరాచకాలకు అంతేలేదు' అని లేఖలో నరసింహ నాయుడు పేర్కొన్నారు.

## వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరణ

పిచ్చాటూరు, జూలై 14: వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు లాక్కెలిన సంఘటన పిచ్చాటూరు మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని అప్పలరాజుకండ్రిగ గ్రామానికి చెందిన శకుంతలమ్మ ఇంటి వద్ద ఉండగా ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు స్కూటీ మీద వచ్చి బలవంతంగా ఆమెను కొట్టి మెడలో ఉన్న 36 గ్రాముల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు.

## జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



వంశీ తల్లితండ్రులకు సాయమందిస్తున్న జనసేన నాయకులు

సత్యవేడు, జూలై 14: సత్యవేడు మండలం కొల్లడం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త వంశీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ లావణ్య కుమార్, మండల అధ్యక్షుడు రూపేష్ కుమార్ ఆధ్వర్యంలో వంశీ తల్లితండ్రులు నిర్మల, చిన్నరాసును కలిసి పరామర్శించారు. రూ.20వేలు సాయం అందించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసానిచ్చారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి హేమకుమార్, మణికంఠ, హేమంత్, చెంచయ్య పాల్గొన్నారు.

## తాగునీటి బోర్ల ప్రారంభం

రేణిగుంట, జూలై 14: రేణిగుంట మండలం వెంకటాపురం పరిధిలోని అన్నసంపల్లె, అల్లిమిట్ట గ్రామాల్లో తాగునీటి బోర్లను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ ప్రాంతంలో తాగునీటి సమస్యను గుర్తించిన సుధీర్‌రెడ్డి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాదమునిరెడ్డి, మునిచంద్రారెడ్డి, మహబూబ్‌బాషా, సుబ్రహ్మణ్యంరెడ్డి, భాస్కరరెడ్డి, మునిరెడ్డి, ఉమామహేశ్వర్, చిన్నప్పరెడ్డి, కుమార్‌రెడ్డి, మునిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే రేణిగుంట పట్టణంలోని సంతగేటు దర్గా వద్ద జరిగిన పీర్లపండుగకు రిషితారెడ్డి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

## ఆర్‌ఎంపీ వైద్యుల సమావేశం

శ్రీకాళహస్తి, జూలై 14: పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రిలో ఆదివారం ఆర్‌ఎంపీ వైద్యులు సమావేశం జరిగింది. ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్య శ్రేయస్సు కోసం వైద్యసేవలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక తమ ఆస్పత్రిలో 24 గంటల వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని, తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఆర్‌ఎంపీ వైద్యులు ప్రజలకు మంచి వైద్యసేవలు అందించాలన్నారు.

## సమస్యలను పరిష్కరించండి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న మునస్వామి యాదవ్

కేవీబీపురం, జూలై 14: టీడీపీ బీసీ సెల్ నాయకుడు మునస్వామి యాదవ్ అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి కేవీబీపురం మండలంలో సమస్యలను వివరించారు. గత ప్రభుత్వంలో టీడీపీ నేతలు చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయకుండా ఇబ్బందుల పాల్జేశారని, ఆర్థికంగా దెబ్బతిన అప్పులపాలయ్యారన్నారు. అలాగే టీడీపీ సర్పంచులకు పనులు అప్పగించకుండా పెండింగ్‌లో ఉంచారని, వాటిని పరిష్కరించాలని సీఎంకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటకృష్ణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్ బోల్తా: ఒకరికి తీవ్ర గాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 14: మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు పదవ మైలు మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామానికి చెందిన రాజారెడ్డి ద్విచక్ర వాహనంలో ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగ వచ్చి తిరిగి వెళ్తుండగా పదవమైలు వద్ద అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయా లయ్యాయి. అతడిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## మురుగు పారే దారేదీ?




ఇళ్ల మధ్య నిల్వ చేరిన మురుగునీరు

వరదయ్యపాళెం, జూలై 14: వరదయ్యపాళెం మండలం తొండంబట్టు గ్రామం మధ్యలో మురుగు నిల్వ చేరి కుంటలా మారింది. గ్రామంలోని మురుగునీరు రోడ్డుపక్క నుంచి కుప్పడుతగేలి గ్రామం ఆనుకుని ఉన్న గుంటలోకి వెళ్లాల్సి ఉన్నా పొలం యజమాని అడ్డగించడంతో ఊరి మధ్యలో నిల్వ చేరుతోంది. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ఊరి మధ్యలో మురుగు నిల్వచేరి దోమలు వృద్ధి చెందుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలోని మురుగు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## తిరుపతిలో పనిచేయడం పూర్వజన్మ సుకృతం

● ఎస్పీ హర్షవర్ధన రాజు



హర్షవర్ధన రాజును సన్మానిస్తున్న పోలీసు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 14: తిరుపతి జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని ఎస్పీ హర్షవర్ధన రాజు అన్నారు. కడప జిల్లాకు బదిలీపై వెళుతున్న ఆయనను పోలీసు అధికారులు ఆదివారం రాత్రి స్థానిక పోలీసు అతిథి గృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వెంకటేశ్వరుడు కొలువైన చోట సంతృప్తికర సేవలు అందించామన్నారు. కీలక దశలో బాధ్యతలు చేపట్టి ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో అందరి సహకారం మరచిపోలేనన్నారు. హోంగార్డు నుంచి ఉన్నతాధికారి వరకు తనకు అందరూ సమానమేనన్నారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్ మాట్లాడుతూ సమర్థవంతమైన అధికారి వద్ద పనిచేయడం గొప్పగా భావిస్తున్నామన్నారు. జిల్లా పోలీసు శాఖ తరపున ఎస్పీని గజమాలతో సత్కరించి శాలువా కప్పి వీడ్కోలు పలికారు. వీడ్కోలు సభలో అదనపు ఎస్పీ విమలకుమారి, డీఎస్పీలు రవిమనోహరాచ్చారి, భవ్యకిషోర్, రమణకుమార్, రవికుమార్‌తో పాటు జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కావమ్మకు పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 14: మండలంలోని కాంపాళెం గ్రామంలో కావమ్మకు గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కావమ్మ ఉత్సవ మూర్తులకు అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

# పుత్తూరు వార్తలు

## టీడీపీ పట్టణాధ్యక్షుడికి నేతల శుభాకాంక్షలు



జీవరత్నం నాయుడిని సన్మానిస్తున్న నాయకులు

పుత్తూరు టౌన్, జూలై 14: పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో జీవరత్నం నాయుడు కేక్ కట్ చేశారు. ఆయనకు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి ఎమ్ఎన్ ధనపాల్, నాయకులు డీజీ ధనపాల్, ఎల్లంటి రమేష్ నాయుడు, ప్రసాద్, రాజేంద్ర, మాధవ, రమేష్, ధనంజయులు నాయుడు, సత్య, వెంకటేశ్వర రావు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో త్రిశూల స్నానం

నారాయణవనం, జూలై 14: మండల కేంద్రమైన నారాయణవనంలో వెలసిన చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు త్రిశూల స్నానంతో ఆదివారం ముగిశాయి. వేకువజామున సుప్రభాతసేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ ప్రత్యేక పుష్పాలతో, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఆలయ ప్రధాన అర్చకులు శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలను ముగించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

# శివుడి సొమ్మునూ దుర్వినియోగం చేస్తారా?

### సదాశివకోన ఆలయ జమా ఖర్చులపై భక్తుల ఆగ్రహం



సమావేశంలో పాల్గొన్న ఈవో, అన్నదాన సమాజం సభ్యులు

వడమాలపేట, జూలై 14: వడమాలపేట మండలంలోని సదాశివకోన ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణ ఖర్చుల్లో లక్షలాది రూపాయలు గోల్‌మాల్ జరిగినట్లు భక్తులు ఆరోపించారు. మార్చి 8వ తేదీన మహాశివరాత్రి ఉత్సవాల జమా ఖర్చులపై వడమాలపేటలో ఆదివారం బహిరంగ సమావేశం నిర్వహించారు. శివరాత్రి తరువాత వారం రోజుల్లో బహిరంగ సమావేశం ద్వారా లెక్కలు చూపించాల్సి ఉంది. అయితే నాలుగు నెలలుగా ఈవో ఖర్చుల వివరాలు వెల్లడించలేదు. దీంతో పలువురు భక్తులు శనివారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు ఆదివారం సమావేశం జరిగిపి జమా ఖర్చులను వెల్లడించారు. మార్చిలో జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల్లో హుండీ, దర్శన టికెట్లు, తలనీలాలు వేలం ద్వారా రూ.13,29,639 ఆదాయం వచ్చింది. ఖర్చులకు సంబంధించి రూ.10,31,670 మేరకు వ్యయం చేసినట్లుగా చూపెట్టారు. ఇందులో భారీగా తేడాలను గమనించి భక్తులు ఈవో రామచంద్రారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారుగా రూ.5 లక్షల మేరకు దేవుడి నిధులు దోచేశారని ఆరోపించారు. ఆలయ చైర్మన్ జయచంద్రన్ అనుమతితోనే వ్యయం చేసినట్లు ఈవో తెలిపారు. రెండేళ్లుగా మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక భక్తులు విరాళాల రూపంలో లక్షలాది రూపాయల నగదు, ఆభరణాలు కానుకలు ఇచ్చారని, దాతలకు ఎలాంటి రసీదులు ఇవ్వలేదన్నారు. దేవుడి సొమ్ము కాజేసిన వారిని క్షమించేది లేదని, గత రెండేళ్లలో జరిగిన అక్రమాలపై పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నదాన సమాజం సభ్యులు హెచ్చరించారు. సమావేశంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, అన్నదాన సమాజం భక్తులు భాస్కర నాయుడు, శ్రీధర్ రాజు, సత్యనారాయణ, సంపత్తు, రమేష్, లక్ష్మయ్య మురళి, శివరాయల్, హేమాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మకు మొక్కులు చెల్లింపు

పుత్తూరు అర్బన్, జూలై 14: నగరి ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్ అత్యధిక మెజార్టీతో గెలవడం, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు సారథ్యంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో మున్సిపల్ పరిధిలోని ఒకటవ వార్డు కట్టకింద రామకృష్ణాపురం గ్రామస్తులు ఆదివారం గ్రామదేవత గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం ఇళ్ల వద్ద అంబలి పోసి అమ్మవారి ఆలయం వద్దకు పొంగళ్లను ఊరేగింపు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, నాయకులు పండారం మణి, సంతోష్, చొక్కలింగా రెడ్డి, అర్జున్‌రెడ్డి, మహేష్, నారాయణ, సుబ్రహ్మణ్యంరెడ్డి, గోవిందస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న గ్రామస్థులు